# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 20-2-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 166 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్న గవర్నర్

మేడారం, ఫిబ్రవరి 19:: మేడారం సమ్మక్క-సారలమ్మను గవర్నర్ తమిళిసై దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు నిలువెత్తు బంగారం(బెల్లం) తమిళిసై సమర్పించారు. గవర్నర్‌కు ములుగు ఎమ్మెల్యే సీతక్క స్వాగతం పలికారు. అయితే గవర్నర్ తమిళిసైకి స్వాగతం పలికేందుకు మంత్రులు రాలేదు. తన రాక సందర్భంగా భక్తులను ఆపడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన ప్రజలందరి సమ్మక్క సారలమ్మ జాతర శుభాకాంక్షలు తెలిపారు. సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న తర్వాత గవర్నర్ మీడియాతో మాట్లాడారు. అమ్మ దీవేనలు ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నానని తమిళిసై తెలిపారు.

# ముగిసిన మేడారం జాతర

## కోటి 35 లక్షల మంది హాజరు

మేడారం, ఫిబ్రవరి 19:: తెలంగాణలో అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగే మేడారం గిరిజన జాతర విజయవంతంగా ముగిసిందని జాతర పరిశీలకులుగా ఉన్న రావు తెలిపారు. జాతర చివరి రోజు పురస్కరించుకుని శనివారం మంత్రులు జిల్లా కలెక్టర్, ఎస్పిలతో కలిసి నేడు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రటించారు. ఈ ఏడాది జాతరకు కోటి ముప్పైఐదు లక్షల మంది భక్తులు వచ్చారు. గతంలో ఎన్నడూ లేని రీతిగా జాతర నిర్వహించుకున్నాము. జాతర విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృజ్ఞాతులు. జాతర ప్రతిష్టత , గౌరవం పెంచేలా అధికార యంత్రాంగం పనిచేసిందని వారు ప్రశంసించారు. జాతర కు వచ్చిన ప్రతి ఒక్క భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తల్లుల దర్శనం కలిగించామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతు జాతర విజయవంతానికి కృషి చేసిన పారిశుధ్య, ఆరోగ్య, రవాణా, పోలీస్, రెవిన్యూ ఇతర శాఖల విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ముఖ్యంగా పూజారులు, ఆదివాసుల సహకారం ఎనలేనిదన్నారు. రాత్రి పగలు కష్టపడి కవరేజ్ చేసిన మీడియా సేవలు మారువలేనిదని ఆయన తెలిపారు.

గత జాతరలో చిన్న చిన్న పొరపాట్లు జరిగాయని ఈసారి ఎటువంటి లోపానికి తావులేకుండా జాతర సక్రమంగా నిర్వహించమన్నారు. తల్లుల రాకకు ముందే దాదాపు 60లక్షల మంది భక్తులు మేడారనికి వచ్చారని జాతర సమయంలో 60 నుండి 70 లక్షల మంది భక్తులు తల్లులను దర్శించుకున్నారని తెలిపారు. ఈ ఏడాది దాదాపుగా కోటి 20 నుండి 35 లక్షల భక్తులు వచ్చినట్లు అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జాతర నిర్వహణకు వివిధ జిల్లాల నుండి 1200 మంది అధికారులు విధులు నిర్వహించారన్నారు. 900 మంది పరామెడికల్, పది వేలకు పైగా పోలీసులు,4000 మంది పారిశుధ్య కార్మికులు ఇలా అన్ని శాఖల నుండి అధికారులును కేయుయించడం జరిగిందన్నారు. జాతర సందర్భంగా 6700 టెంపరరీ, 300 శాశ్వత మరుగుదొడ్లు నిర్మించామన్నారు. తల్లుల దీవెనతో కరోన తగ్గుముఖం పెట్టిందని, అమ్మవారి చలువతో ఇబ్బందులు కలగకుండా జాతర ముగించుకున్నామని ఆయన చెప్పారు.

దేవాదాయ శాఖా మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ ఆసియా ఖండం లోనే అతి పెద్ద జాతరను రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసి విజయవంతగా పూర్తి చేసిందని తెలిపారు. త్వరలో పోలీస్ ఆర్టీసీ ఇతర ప్రధాన శాఖలకు శాశ్వత షెడ్ల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ లోను భక్తుల దర్శనం లోను ఎటువంటి ఇబ్బంది కలగలేదని ఏ ఒక్క ఫిర్యాదు రాకుండా జాతరను పూర్తి చేశామన్నారు. తక్కువ సమయంలో దర్శనం కలగడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారని అధికారులు భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.ములుగు జిల్లా కలెక్టర్ కృష్ణాదిత్య మాట్లాడుతూ జాతర విజయవంతానికి సహకరించిన అందరికి అభినందనలు తెలిపారు.ముఖ్యంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు చేస్తూ తోడ్పాటును అందించారని తెలిపారు. ఆరు నెలల ముందు నుండే జాతర పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేశామన్నారు. ముఖ్యంగా రవాణా పై ప్రత్యేక శ్రద్ధ వహించామని తద్వారా రవాణాకు ఎటువంటి అంతరాయం కలగలేదన్నారు. ఈ ఏడాది భక్తులు కూడా ఒక్కరోజు బస చేసి తల్లుల దర్శనం చేసుకొని వెళ్లారని అన్నారు. ఈ మేరకు కొంత రద్దీ తగ్గిందన్నారు. పార్కింగ్ స్థలాల పైన ప్రత్యేక శ్రద్ధ వహించామని ఎంట్రీ ఎక్సిట్ గేట్స్ పెట్టడం వలన ట్రాఫిక్ సమస్య కలగలేదన్నారు. జాతరకు ముందె అధిక సంఖ్యలో భక్తులు మేడారనికి వచ్చారని ఒక్క గత ఆదివారమే 3 ను పై 5 లక్షల మంది దర్శనం చేసుకున్నారన్నారు. జాతరకు రెండు వారాల ముందు నుండే వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు.

## తెలంగాణకు రావాల్సిన బకాయిలు విడుదల చేయండి- కేంద్రానికి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 19: తెలంగాణకు రావాల్సిన గ్రాంట్లను విడుదల చేయాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు శనివారం మరోసారి లేఖ రాశారు. గతంలో చేసిన అభ్యర్థులను మరోసారి గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 94 (2) ప్రకారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేటాయించిన నిధుల్లో రెండేండ్ల బకాయి రూ.900 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయడంతో పాటు గ్రాంట్‌ను 2021–22 తర్వాత ఐదేళ్లపాటు పొడగించాలని కోరారు. నీతి ఆయోగ్ సూచించిన మేరకు రూ.24,205 కోట్లు ఇవ్వాలన్నారు.

స్థానిక సంస్థలకు రూ.817.61 కోట్లు (గ్రామీణ స్థానిక సంస్థలకు రూ. 315.32 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.502.29 కోట్లు) ఇవ్వాలన్న 14వ ఆర్థిక సంఘం సిఫారసులను కేంద్రం అకారణంగా తిరస్కరించిందని, రాష్ట్రం అన్ని షరతులను పూర్తి చేసినప్పటికీ, నిర్దిష్ట కారణం లేకుండా గ్రాంట్లను తిరస్కరించారన్న ఆయన వీలైనంత త్వరగా వాటిని విడుదల చేయాలన్నారు. 2019–20తో పోల్చితే 2020–21లో రాష్ట్రానికి పన్నుల్లో వాటా తగ్గుతుందని ఈ మేరకు తెలంగాణకు రూ.723 కోట్ల ప్రత్యేక గ్రాంట్ విడుదల చేయాలని 15వ ఆర్థిక సంఘం సూచించిందని, ఆర్థిక సంఘం సిఫార్సులను గతంలో ఎప్పుడూ తిరస్కరించిన సందర్భాలు లేవన్నారు.

రాష్ట్రంలో అమలు చేస్తున్న కేంద్ర ప్రాయోజిత పథకాల్లో రాష్ట్రం ఏర్పడిన మొదటి సంవత్సరమైన 2014–15లో కేంద్రం వాటాను పొరబాటున తెలంగాణకు కాకుండా ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేశారని, దీంతో తెలంగాణకు రావాల్సిన రూ.495.20 కోట్లు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాయి. ఈ విషయాన్ని ఏపీ ప్రభుత్వంతో పాటు అకౌంటెంట్ జనరల్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ.. ఇంకా తెలంగాణకు సర్దుబాటు చేయలేదన్నారు. ఈ మొత్తాన్ని తెలంగాణకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితోపాటు పెండింగ్‌లో ఉన్న ఐజీఎస్టీ నిధులు రూ.210కోట్లను కూడా సర్దుబాటు చేయాలని కోరారు.

## తెలంగాణ పథకాలు అద్భుతం.. అభినందించిన సిక్కిం మంత్రి




హైదరాబాద్, ఫిబ్రవరి 19:తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని సిక్కిం పశుసంవర్ధక, వ్యవసాయశాఖల మంత్రి లోకనాథ్ శర్మ ప్రశంసించారు. ఒక రోజు పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన మంత్రి మసబ్‌ట్యాంక్‌లోని పశు సంవర్ధక డైరెక్టరేట్‌లోని కార్యాలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అదర్ సిన్హా, ఆ శాఖ డైరెక్టర్ రాంచందర్, టీఎస్ఎల్‌డీఏ సీఈవో మంజువాణి, విజయ డెయిరీ జీఎం కామేశ్, మత్స్య శాఖ జేడీ మురళీకృష్ణతో సమావేశమయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై మంత్రి తలసాని ఆయనకు వివరించారు.

జీవాల పరిరక్షణ కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా వంద సంచార పశువైద్య వాహనాలను ప్రారంభించి, జీవాల వద్దకే వెళ్లి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. అవి వ్యాధుల భారిన పడకుండా వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఃఖీఎ) ఆధ్వర్యంలో ఆరు రకాల వ్యాక్సిన్లను ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర అవసరాలు తీరిన అనంతరం మిగతా వాటిని ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలు ఆర్థికాభివృద్ధి ఎంతో దోహదపడ్డాయని వివరించారు. కులవృత్తులను ప్రోత్సహించేందుకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలను ఉద్దేశంతో గొర్రెల యూనిట్ల పంపిణీ ప్రారంభించామని, అనతికాలంలో ఆశించిన ఫలితాలు లభించాయన్నారు. వ్యవసాయం తర్వాతి స్థానంలో నిలిచే పాడిరంగం అభివృద్ధి, పాడి రైతులను ప్రోత్సహించేందుకు పథకాలు ప్రభుత్వం రూపొందించి, అమలు చేస్తుందన్నారు.

ప్రభుత్వరంగంలోని విజయ డెయిరీ పాలు సరఫరా చేసే రైతులకు లీటరు పాలకు అదనంగా రూ.4 చొప్పున ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా 2.93లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని, ఇప్పటి వరకు రూ.343కోట్లు రైతులకు చెల్లించామన్నారు. కార్యక్రమం తర్వాత డెయిరీకి 1.27లక్షల లీటర్ల నుంచి 3.97లక్షల లీటర్లకు పెరిగిందన్నారు. పాలు, వివిధ రకాల పాల పదార్థాలను ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నట్లు చెప్పారు. మేలుజాతి పశుసంపద ను అభివృద్ధి చేయడం ద్వారా పాల ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యంతో కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందుకోసం కరీంనగర్‌లో పశువీర్య ఉత్పత్తి కేంద్రం, నాణ్యత పరీక్షల కోసం ఒక ల్యాబ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

కంసానిపల్లిలో మరో కేంద్రం నిర్మాణ పనులు చివరి దశకు చేరాయన్నారు. అదేవిధంగా మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్రంలోని అన్ని నీటి వనరులలో ఉచితంగా చేప పిల్లలు, మంచినీటి రిజర్వాయర్లలో రొయ్య పిల్లల పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా మత్స్యకారులు చేపలు విక్రయించుకోవడానికి సబ్సిడీ పై వాహనాలు, చేపలు, చేపల వంటకాల విక్రయాల కోసం మొబైల్ రిటైల్ ఫిష్ ఔట్ లెట్ లను సబ్సిడీపై అందజేసిన విషయాన్ని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి లోక్‌నాథ్ మాట్లాడుతూ పాడి, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం అద్భుతంగా ఉందన్నారు. సిక్కింలోనూ పథకాలు అమలు చేసే విషయాన్ని పరిశీలిస్తామని, ఈ మేరకు సహకారం అందించాలని కోరారు. త్వరలోనే తెలంగాణలో సిక్కిం అధికారులు పర్యటిస్తారని తెలుపగా.. మంత్రి శ్రీనివాస్ యాదవ్ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు : మంత్రి తలసాని




హైదరాబాద్, ఫిబ్రవరి 19:ప్రైవేటుకు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది, బలోపేతం చేయనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన 'మన బస్తి – మన బడి' కార్యక్రమంపై మంత్రి మసబ్ ట్యాంక్‌లోని కార్యాలయంలో హోంశాఖ మంత్రి మహమూద్ అలీతో కలిసి హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మహమూద్ అలీతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.

విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే కాకుండా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం మన బస్తి ? మన బడి కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇందుకు రూ.7,289.54కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో 499 ప్రాథమిక, తొమ్మిది ప్రాథమికోన్నత, 182 ఉన్నత పాఠశాలలున్నాయని తెలిపారు. ఆయా పాఠశాలల్లో 1.25లక్షల విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు.

కార్యక్రమం తొలి విడతలో 239 పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో నియోజకవర్గానికి పది పాఠశాలల చొప్పున అత్యవసరాలున్న పాఠశాలలని గుర్తించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఇందులో భాగంగా పాఠశాలలో విద్యార్థుల కోసం విద్యుత్ సౌకర్యం, తాగునీరు, సరిపడా ఫర్నిచర్, మరుగు దొడ్ల నిర్మాణం తదితర సౌకర్యాలు, కాంపౌండ్ వాల్, వంటశాల నిర్మాణం, శిధిలావస్థలో ఉన్న తరగతి గదుల స్థానంలో కొత్తవాటి నిర్మాణం వంటి అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో డిజిటల్ విద్యనందించేందుకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుసహకారంతో ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు.

విద్యార్థులను విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న ఆయన.. కొన్ని పాఠశాలల్లో క్రీడా స్థలాలు లేవన్నారు. అందుబాటులో ఉన్న జీహెచ్ఎంసీ స్థలాలను క్రీడాస్థలాలు అభివృద్ధి చేయాలని అవసరం ఉందని పలువురు ఎమ్మెల్యేలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారన్నారు. సోమవారం జరుగనున్న ఉపసంఘ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ఫలితంగా విద్యార్థుల హాజరుశాతం పెరగడంతో పాటు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారన్నారు. హోంమంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో విద్య ఎంతో ముఖ్యమైందన్నారు.

ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. దాతలు, కార్పొరేట సంస్థ సహకారం, ప్రవాస భారతీయుల సహకారంతో కూడా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకర్, సురభి వాణిదేవి, స్టీఫెన్ సన్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, జాఫర్ హుస్సేన్, అహ్మద్ బిన్ బలాల, కలెక్టర్ శర్మన్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతేశ్రీలత, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికలే కాంగ్రెస్‌కు చివరి ఎన్నికలు : వైరల్ అవుతున్న దిగ్విజయ్ వ్యాఖ్యలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19:కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు దిగ్విజయ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఒకవేళ కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయని పక్షంలో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఇవే చివరి ఎలక్షన్లు అవుతాయి అంటూ దిగ్విజయ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేయడం ఇందులో కనిపిస్తుంది. కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ శనివారం మధ్యప్రదేశ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రట్లం జిల్లాలో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? 'ఒకరినొకరు కలుసుకోవడానికి మీరెవ్వరూ ఇష్టపడటం లేదు. ఒకరు ఒక ప్రదేశంలో ఉంటే.. మరొకరు మరో ప్రదేశం.. ఇంకొకరు ఇంకో ప్రదేశంలో ఉంటున్నారు. ఇలా చేస్తే పనులు కావు. ఎన్నికల్లో నిజాయితీగా పనిచేయని పక్షంలో, మనకు ఇవే చిట్టచివరి ఎన్నికలవుతాయి జాగ్రత్త. లేదంటే ఇంట్లో కూర్చోండి. ఇక.. కాంగ్రెస్ అధికారంలోకి రాదు. దీంతో ఇక మీకు కార్యకర్తలు కూడా దొరకరు' అంటూ దిగ్విజయ్ సింగ్ స్థానిక నేతలను తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.


## బీజేపీ నేతల తీరు మార్చుకోవాలి.. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫైర్

ములుగు, ఫిబ్రవరి 19: : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిచ్చోడా, మంచోడా..సమ్మక్క సారలమ్మల దర్శనానికి వచ్చి రాజకీయాలు మాట్లాడతారా.. అంటూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫైర్ అయ్యారు. అన్ని గుడులు, దేవాలయాలు తిరిగే ప్రధాని నరేంద్ర మోదీ మేడారం ఎందుకు రాలేదని ప్రశ్నించారు. గిరిజన జాతరపై ఎందుకు చిన్నచూపని ఎర్రబెల్లి నిలదీశారు. కుంభమేళాకు కోట్లాది రూపాయలు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం... మేడారం జాతరకు 2కోట్లు ఇస్తుందా? అని ప్రశ్నించారు. హిందూ ధర్మం అని చెప్పే బీజేపీకి మేడారం అభివృద్ధి పట్టదా? అని నిలదీశారు. మత చిచ్చులు పెట్టి లబ్ధి పొందాలని చూస్తున్నారంటూ మండిపడ్డారు. బీజేపీ నేతల తీరు మార్చుకోవాలి లేదంటే జంపన్న యుద్ధం చేసిన మాదిరిగా ఉరికించి కొడతామని ఎర్రబెల్లి హెచ్చరించారు.

## ఈ 10 మంది అత్యంత నిరుపేదలే.. అత్యంత నిరుపేద పంజాబ్ అభ్యర్థుల జాబితా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:ఐదు రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరుగుతున్నాయి. దాదాపుగా అన్ని పార్టీలూ దాదాపుగా కోటీశ్వరులనే తమ అభ్యర్థులుగా ప్రకటించారు. ఎన్నికలంటేనే కోట్లకు కోట్ల రూపాయలు ఖర్చు చేయడం పంచడం.. ఇవన్నీ ఎన్నికల సమయంలో నడిచేవి. అయితే అత్యంత నిరుపేదలు కూడా ఎన్నికల్లో నిలబడతారు. అన్ని పార్టీలూ కాస్తో కూస్తో ఇలాంటి వారికి కూడా టిక్కెట్లు ఇస్తుంటారు. వీరి వద్ద కోట్లకు కోట్ల రూపాయలు లేకున్నా? ప్రజల్లో విశేషమైన ఆదరణ వుంటుంది. అందుకే వారికి కూడా టిక్కెట్ ఇస్తుంది. అచ్చు ఇలాంటి వారే పంజాబ్ ఎన్నికల్లో నిలుచున్నారు. వారు అత్యంత నిరుపేదలు. ఉండడానికి సొంత ఇళ్లు కూడా లేదు. జేబులో ఓ 5,000 రూపాయలు ఉంటే మహా గగనం. అయినా ఈ 10 మంది ఎన్నికల్లో అభ్యంర్థులుగా నిల్చున్నారు. ఈ 10 మంది అభ్యర్థుల్లోనే ఐదుగురి వద్ద అసలు ఆస్తులే లేవు.

### చరిత్రలో నేటినిజం




మన్నిక గల నటనవలులూ_
ఎన్నం గల నటులయందు నిప్పితమతియై
"అన్నూకపూరు" నిలచెను
పన్నుగ తరతరములు మన పరదాపైనన్!!

( ఫిబ్రవరి 20 నటుడు అన్నూ కపూర్ పుట్టిన రోజు...)

-రాధశ్రీ

సెల్: 9494481210




కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ Regd.: 6284 | శ్రీ త్యాగరాయ గానసభ (ప్రపంచ రికార్డులు పొందిన ఆడిటోరియం)

యువ విద్యార్థి నాయకుడు, తెలంగాణ అభిమాని

ఫణి భార్గవ్ యాదిలో...



నగదు పురస్కారం
డా|| సి.హెచ్. బాబావలీరావు గారు (కవి) M.A. PhD.
శ్రీ మిద్దె సురేష్ గారు (కవి) M.A. PGDRD, PGDHR, Journalism
శ్రీ యం. అమరేందర్ గారు (విద్యార్థి) B.Pharmacy

ఆర్థిక సహాయం
Child Vikas Foundation
Prasanth Nagar, Uppal, Hyd.

ముఖ్యఅతిథి
శ్రీ డా|| కె.వి. రమణ గారు IAS (Retd) తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు, అధ్యక్షులు బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

ప్రత్యేక ఆహ్వానితులు
శ్రీమతి జి. వసుంధర గారు - కార్యదర్శి, తెలంగాణ సంగీత నాటక అకాడమి
శ్రీ పావని విజయ్ కుమార్ గారు - కార్పొరేటర్, గాంధీనగర్

సభాధ్యక్షులు : డా|| యం.కె. రాము గారు పూర్వ సంచాలకులు, జవహర్ బాలభవన్, రచయిత

విశిష్టఅతిథి : లయన్. కళా వి.యస్. జనార్థన్ మూర్తి గారు అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ

గౌరవ అతిథులు
శ్రీ బైస దేవదాసు గారు సంపాదకులు, నేటినిజం దినపత్రిక
డా|| రెంటాల జయదేవ గారు సీనియర్ జర్నలిస్ట్, రచయిత, సినీ విశ్లేషకులు

శ్రీమతి మాధవి శర్మ గురువు, మంథాన్ రాగలయ శిష్య బృందంచే సంగీత, నృత్య కార్యక్రమాలు
శ్రీమతి సుష్మ ఉదయ్‌మహంతి గురువు, కళాసృష్టి డ్యాన్స్ అకాడమి శిష్య బృందంచే నృత్య కార్యక్రమాలు

20-02-2022 సా|| 5.30 గం||లకు, వేదిక : కళాసుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి.

శ్రీమతి కళాశారద దీక్షితులు, ప్రధాన కార్యదర్శి త్యాగరాయ గానసభ | డి. దయాకర్ రాజు, కన్వీనర్ 8978500443 | ఎ.సురేందర్, స్థాపక కార్యదర్శి 9550512032 | శ్రీమతి ఎ. పుష్పలత అధ్యక్షులు

# సామాజిక న్యాయంతోనే సమసమాజ స్థాపన

**(20 ఫిబ్రవరి 'ప్రపంచ సామాజిక న్యాయ దినం' సందర్భంగా)**

డిజిటల్ ప్రపంచంలో ఆర్థిక వ్యవస్థ పరిపుష్టి, అసమానతల తొలగింపు, శాంతి భద్రతలు, సుస్థిర సమగ్రాభివృద్ధి లాంటి కనీస అవసరాలను కార్యరూపంలోకి మార్చడానికి సామాజిక న్యాయం దోహదపడుతుందనేది వాస్తవం. అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ సమాజాభివృద్ధి, సామాజిక న్యాయం సుసాధ్యం కావడానికి పేదరిక నిర్మూలన, మానమ హక్కుల పరిరక్షణ, లింగ సమానత్వ సాధన, నిరుద్యోగాన్ని నిలువరించడం, సామాజిక భద్రత, ఆర్థిక అసమానతల తొలగింపు, జనాభా నియంత్రణ, నిరక్షరాస్యత నిర్మూలన లాంటి ముఖ్యం అంశాలు దోహదపడతాయని నమ్మిన ఐరాస, అంతర్జాతీయ కార్మిక సంస్థ (అంతర్జాతీయ లేబర్ ఆర్గనైజేషన్, ఐయల్ఓ) 2009 నుంచి ప్రతి ఏటా 20 ఫిబ్రవరిన 'ప్రపంచ సామాజిక న్యాయ దినం' పాటించుట జరుగుతోంది. 26 నవంబర్ 2007న ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం సామాజిక న్యాయం సిద్ధించటానికి అందరికీ ఉద్యోగ ఉపాధుల కల్పన, సామాజిక రక్షణ, రాజ్యాంగ హక్కులు – బాధ్యతలు, సమసమాజ స్థాపన చర్యలు ఉపరిస్తాయని సభ్య దేశాలకు పిలుపును ఇస్తున్నది. పేదరిక నిర్మూలన, గ్లోబల్ పౌరసత్వం, మానవ హక్కుల పరిరక్షణ ప్రాధాన్యతలను అవగాహన కల్పించుటలో విద్యార్థులకు బాల్యదశ నుంచే కృషి చేయాలని ఐరాస కోరుతోంది. కరోనా కల్లోలంలో ఆదాయ వనరుల కల్పన, అందరికీ (మహిళలు, పేదలు, వలస కూలీలు) నైపుణ్యాలకు తగిన ఉద్యోగ ఉపాధుల కల్పన, శ్రమ దోపిడిని కట్టడి చేయడంతో సమాజంలో శాంతి స్థాపన జరుగుతుంది.

ప్రపంచ సామాజిక న్యాయ దినం–2021 నినాదంగా "అచీవింగ్ సోషియల్ జస్టిస్ త్రూ ఫార్మల్ ఎంప్లాయ్‌మెంట్" తీసుకోబడింది. కరోనా మహమ్మారి విధించిన క్రమశిక్షణలో బ్రాడ్‌బాండ్ కనెక్టివిటి, క్లౌడ్ కంప్యూటింగ్, డాటా కల్పనతో వర్క్ ఫ్రమ్ హోమ్ లాంటివి కూడా ఆర్థిక వెసులుబాటును సుసాధ్యం చేయడం చూస్తున్నాం?. నేటి బాలలే రేపటి పౌరులని భావించి సామాజిక న్యాయ అవశ్యకతను వివరించడానికి అందుబాటులో ఉన్న ప్రసార మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అందరూ ఆర్థికంగా సమగ్రాభివృద్ధి చెందినపుడా మాత్రమే శాంతియుత సమాజం, సామాజిక న్యాయం వికసిస్తుందని నమ్మాలి. ప్రపంచవ్యాప్తంగా 2 బిలియన్ల అభాగ్యులు, అందులో 40 కోట్ల యువత (15–29 వయస్సు) కడు పేదరికంలో మగ్గుతున్నారని, వీరిలో 40 శాతం మందికి సరైన ఉద్యోగ ఉపాధులు దొరకడం లేదని తేలింది. అంతర్జాతీయంగా 25.8 కోట్ల అంతర్జాతీయ వలసదారులు ఉన్నారని, వీరిలో 44 శాతం మహిళలలే ఉన్నారని ఐయల్ఓ అంచనా వేసింది. అర్హతకు తగిన పని, పనికి తగిన వేతనం లభించని సమాజంలో సామాజిక అన్యాయం, హింసాత్మక సంఘర్షణలు రాజ్యం ఏలుతాయి. మానవ హక్కుల ఉల్లంఘనలు, కృత్రిమ సామాజిక అవరోధాలు, కులమత విభేదాలు, లింగ అసమానతలు, వలస కూలీల దీనస్థితులు, ఆర్థిక అసమానతలు, దివ్యాంగుల సమస్యలకు సరైన సమాధానం చూపించగల సమాజంలో సామాజిక న్యాయం వర్ధిల్లుతుందని ప్రపంచ దేశాలు నమ్మి చర్యలు తీసుకోవాలి. వయసు, వర్ణం, కులం, మతం, జాతి, పేదరికం, నిరుద్యోగం, వర్గం, ప్రాంతం, లింగం, సంస్కృతి సంప్రదాయాలు లాంటి అభివృద్ధి నిరోధకాలు రాజ్యమేలినంత వరకు సామాజిక అన్యాయం పెరిగి అశాంతి, అసహనాలు బయట పడతాయని గమనించాలి. ప్రపంచ దేశాల మధ్య సామాజిక న్యాయం, సంఘీభావం, సమానత్వం, సామరస్యం నెలకొన్నపుడు మాత్రమే విశ్వశాంతి సుసాధ్యం అవుతుందని ఐరాస పిలుపును ఇస్తున్నది. 'అందరిదీ సమాజం, సమాజాభివృద్ధిలో అందరం' అనే సూత్రం ఆధారంగా ప్రభుత్వ పథకాలు రూపొందించాలి. ఉద్యోగ ఉపాధులు పెరిగితే సామాజిక న్యాయం సిద్ధిస్తుంది. అజ్ఞానం పెరిగినపుడు, పేదరికం కోరులు చాచినపుడు, వివక్ష రాజ్యమేలినపుడు, అన్యాయమే నియమం అయినపుడు సమాజంలో అలజడి, హింస, అశాంతులు నెలకొంటాయి. అన్యాయాన్ని సహించిన సమాజంలో హింస చెలరేగుతుంది. ఆర్థిక అసమానతలను చెదలును చెరుపుతూ సామాజిక న్యాయ దేవతను సమాజంలో ప్రతిష్ట చేద్దాం.



– డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## రాజీనామాపై వెనక్కి తగ్గలేదు : జగ్గారెడ్డి


హైదరాబాద్, ఫిబ్రవరి 19:కాంగ్రెస్ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ? రాజీనామాపై వెనక్కి తగ్గలేదన్నారు. ఈ ప్రకటన తర్వాత తాను కాంగ్రెస్ లో లేనట్టేనన్నారు. అందరినీ ఒప్పించి మూడు నాలుగు రోజుల్లో రాజీనామా చేస్తానన్నారు. తనపై దుష్ప్రచారం తనకు బాధ కలిగించిందన్నారు. తనపై బురద చల్లారనే పార్టీని వీడుతున్నానన్నారు. ఇప్పటికే సోనియా గాంధీకి, రాహుల్ గాంధీకి లేఖ రాశానన్నారు. త్వరలోనే రాజీనామా పత్రాన్ని పంపిస్తానన్నారు. తాను ఎవరికీ భయపడనన్నారు. తనను ప్రణాళికా బద్ధంగా కోవర్ట్ అని ప్రచారం చేస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా కాంగ్రెస్ లోనే కొనసాగానన్నారు. తన తీరు వల్ల కొంత మందికి ఇబ్బంది కలగొచ్చన్నారు. వేరే పార్టీలోకి వెళ్లాలనుకుంటే తనను ఎవరూ ఆపగలరని అన్నారు. ఏ రాజకీయ పార్టీలో చేరాలని లేదన్నారు. తాను పార్టీని వీడినా కాంగ్రెస్ కు నష్టమేమీ జరగదన్నారు. తాను పార్టీ నుంచి తప్పుకుంటేనే తన గురించి చర్చ ఉండదన్నారు.

## కరోనాను మనం కట్టడి చేసి అంతం చేయవచ్చు

జెనీవా, ఫిబ్రవరి 19:: కరోనా మహమ్మారి వ్యాప్తికి, ప్రమాదకర వేరియంట్లు పుట్టుకొచ్చేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా మనం మహమ్మారి అంతానికి సంసిద్ధమైనరోజు అది అంతమవుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) చీఫ్ టెడ్రోస్ అథనమ్ గెబ్రియేసస్ అన్నారు. జర్మనీలో జరుగుతున్న మునిచ్ సెక్యూరిటీ సదస్సు 2022 లైవ్ సెషన్‌లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహమ్మారి నుంచి బయటపడటంపైనే ప్రపంచం దృష్టిసారించాలని ఆయన నొక్కిచెప్పారు.

రెండేండ్ల కిందట మనం కలుసుకున్నప్పుడు వైరస్ గుప్పిట్లోకి జారుతున్నామని, అయితే మహమ్మారి మూడో ఏడాదిలోకి మనం ఇలా అడుగుపెడతామని అప్పట్లో ఏ ఒక్కరూ ఊహించలేదని అన్నారు. గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా మనమందరం సమాయాత్తమైతే మహమ్మారి ఎంతగా వ్యాప్తి చెందుతూ ప్రమాదకర వేరియంట్లు పుట్టుకొచ్చినా దాన్ని మనం కట్టడి చేసి అంతం చేయవచ్చని అన్నారు. కొన్ని దేశాల్లో వ్యాక్సిన్లు అధికంగా ఇవ్వడంతో పాటు ఒమిక్రాన్ తీవ్రత తక్కువగ ఉండటంతో మహమ్మారి ముగిసిందనే ప్రచారం సాగిస్తున్నారని డబ్ల్యూహెచ్ఓ చీఫ్ హెచ్చరించారు.

## ములుగులో రోడ్డు ప్రమాదం.. ఐదుగురు మృతి



ములుగు, ఫిబ్రవరి 19: ములుగులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. ములుగు శివారులోని గట్టమ్మ ఆలయం వద్ద ఆర్టీ బస్సు, కారు ఒకదాన్నొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. వరంగల్ వైపు నుంచి మేడారం వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో గత నెల రోజులుగా ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటోంది.

జాతర మొదలైన గత మూడు రోజుల నుంచి భక్తుల వాహనాలతో రోడ్డు మరింత రద్దీగా మారింది. ఈ నేపథ్యంలో చిన్నచిన్న ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. కానీ, ఈ స్థాయిలో ప్రాణనష్టం జరగడం ఇదే తొలిసారి. కాగా, ఈ దుర్ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను ములుగు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రాష్ట్రంలో విద్యుత్ సమస్య లేదు : బొత్స

అమరావతి, ఫిబ్రవరి 19: ఏపీ ప్రభుత్వానికి, ఎన్టీపీసీకి మధ్య కొంత గ్యాప్ వచ్చిన సంగతి నిజమేనని? అయితే సమస్య అయిపోయిన తర్వాత కూడా భూతద్దంలో చూపిస్తూ మాట్లాడటం సరికాదని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సమస్యలన్నింటినీ పరిష్కరించుకుంటామని చెప్పారు. చంద్రబాబు, అచ్చెన్నాయుడు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ సమస్య లేదని అన్నారు. కావాలంటే గ్రామాల్లోకి వెళదాం రండని చెప్పారు. సీఎం జగన్ చిన్నాన్న వైయస్ వివేకా హత్యకేసులో కూడా రాద్ధాంతం చేస్తున్నారని బొత్స మండిపడ్డారు. హత్యకు సంబంధం లేని పేర్ల గురించి మాట్లాడుతూ ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

క్లీన్ ఆంధ్రప్రదేశ్ కోసమే చెత్తపై రోజుకు రూపాయి, రెండ్రూపాయలు వసూలు చేస్తున్నామని? కానీ, ప్రజలను దోచుకుతింటున్నట్టు కొన్ని పత్రికలు పనికట్టుకుని ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలకు రూ. 5 లక్షలు ఇస్తామని తాము ఎక్కడా చెప్పలేదని బొత్స అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఇంటి స్థలం, నిర్మాణానికి డబ్బులు ఇస్తామని మాత్రమే చెప్పామని తెలిపారు. రాజకీయ అవసరాల కోసం కొన్ని మాటలు మాట్లాడితే తప్పులేదని కానీ ఉన్నవి, లేనివి మాట్లాడటం సరికాదని అన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణంలో రాజీ పడకూడదని జగన్ చెప్పారని తెలిపారు. ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఉన్నా, ఏదోఒకలా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. పీఆర్సీ విషయంలో కూడా ఏదో జరిగిపోతుందని టీడీపీ నేతలు భావించారని? కానీ ఉద్యోగులు వారి తప్పును తెలుసుకున్నారని అన్నారు.

# 'ప్రతి ఇంటికీ నీరు' లక్ష్యం వంద జిల్లాల్లో సాకారం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: దేశవ్యాప్తంగా 9కోట్ల ఇళ్లకు కుళాయిల ద్వారా మంచినీరు అందించే లక్ష్యాన్ని ఈ నెల 16వ తేదీన సాధించిన జలజీవన్ మిషన్ పథకం తాజాగా మరో మైలురాయిని అధిగమించింది. నేటితో దేశంలోని వంద జిల్లాల్లో ప్రతి ఇంటికీ నీటి కుళాయిలు అమర్చిన రికార్డును సొంతం చేసుకుంది. 'ప్రతి ఇంటికీ నీరు' అన్న లక్ష్యాన్ని సాధించిన 100వ జిల్లాగా హిమాచల్ ప్రదేశ్ లోని చంబా జిల్లా నిలిచింది. ఇది ఈ రికార్డు సాధించిన దేశంలోని ఐదవ ఆశావహ జిల్లాగా కూడా చంబా మరో ఘనతను సాధించింది. ఈ రికార్డును ఇప్పటికే సొంతం చేసుకున్న మిగతా ఆశావహ జిల్లాల్లో తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, జైశంకర్ భూపాలపల్లి, కొమరం భీం ఆసిఫాబాద్, దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఇంటికీ 2024వ సవంత్సరం నాటికల్లా పరిశుభ్రమైన నీటిని కుళాయిల ద్వారా అందించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలను సాకారం చేసేందుకు జలజీవన్ మిషన్ పథకం కింద ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తోంది. గత రెండున్నరేళ్ల తక్కువ వ్యవధిలోనే కోవిడ్–19 వైరస్ మహమ్మారి వ్యాప్తి, లాక్ డౌన్ ఆంక్షలు ఎదురైనప్పటికీ, ఈ పథకం కింద 5.78కోట్లకు పైగా ఇళ్లకు నీటి కుళాయిలను అమర్చారు. దీనితో దేశంలోని 100 జిల్లాల్లో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా పరిశుద్ధమైన నీటి సరఫరా జరుగుతోంది. 2024 నాటికల్లా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కుళాయి నీటిని సరఫరా చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసే దిశగా జలజీవన్ మిషన్ ముందుకు సాగుతోంది.

2019వ సంవత్సరం ఆగస్టు 15వ తేదీన జలజీవన్ మిషన్ ప్రకటించిన సమయానికి దేశవ్యాప్తంగా 19.27కోట్ల ఇళ్లకుగాను, కేవలం 3.23 కోట్ల ఇళ్లకు (17శాతం ఇళ్లకు) మాత్రమే నీటి కుళాయిల కనెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. అయితే, 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్' పేరిట ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపును స్ఫూర్తిగా తీసుకుని, 'ప్రతి ఇంటికీ నీరు' అన్న లక్ష్య సాధనకు దేశంలో బృహత్తర స్థాయిలో కృషి జరిగింది. అతి తక్కువ వ్యవధిలోనే 100 జిల్లాలు, 1,138 బ్లాకులు, 66,328 గ్రామ పంచాయతీలు, 1,36,803 గ్రామాల్లో ఈ లక్ష్యాన్ని సాధించ గలిగారు. గోవా, హర్యానా, తెలంగాణ, పుదుచ్చేరి, దాదర్–నాగర్ హవేలీ, డామన్–డయ్యూ ప్రాంతాల పరిధిలోని ప్రతి గ్రామీణ ఇంటికీ కుళాయిల ద్వారా నీటి సరఫరాను ఏర్పాటు చేయగలిగారు. 'ప్రతి ఇంటికీ నీరు' అందించడంలో మరిన్ని రాష్ట్రాలు కూడా గణనీయమైన ఫలితాలు సాధించి లక్ష్య సాధన దిశగా పురోగమిస్తున్నాయి. ఈ విషయంలో పంజాబ్ (99శాతం), హిమాచల్ ప్రదేశ్ (92.5శాతం), గుజరాత్ (92.5శాతం), బీహార్ (92శాతం) చక్కని ఫలితాలను సాధించాయి.

ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ నీటి కుళాయిలను అమర్చాలన్న ఈ బృహత్తర కార్యక్రమంలో ఆశించిన లక్ష్యాల సాధనకోసం రూ. 3.60లక్షల కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ప్రతి ఇంటికీ నీరు లక్ష్య సాధనలో భాగంగా 3.8కోట్ల ఇళ్లకు నీటి కుళాయిల ఏర్పాటు కోసం 2022–23సంవత్సరపు బడ్జెట్లో రూ. 60,000కోట్లను కేటాయించారు.

దీనికి తోడుగా, 2021–22లో వివిధ రాష్ట్రాలకు 15వ ఆర్థిక సంఘం గ్రాంటుతో అనుసంధానించిన గ్రాంటు కింద, రూ. 26,940కోట్లను కేటాయించారు. గ్రామీణ స్థానిక సంస్థలు, పంచాయతీ రాజ్ సంస్థలకు నీటి సరఫరా, పారిశుద్ధ్య ఏర్పాట్ల కింద ఈ నిధుల కేటాయింపు జరిగింది. వచ్చే ఐదేళ్ల వరకూ అంటే 2025–26వ సంవత్సరం వరకూ తప్పనిసరిగా అందించే నిధుల కింద రూ. 1,42, 084 కోట్లను ఈ పథకానికి అందుబాటులో ఉంచారు. దేశ వ్యాప్తంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో పెడుతున్న ఈ భారీ స్థాయి పెట్టుబడులతో ఆర్థిక కార్యకలాపాలు వేగం పుంజుకుంటాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా ఊపందుకుంటుంది. అదే సమయంలో గ్రామ ప్రాంతాల్లోని యువజనులకు గణనీయంగా ఉపాధి కల్పనా అవకాశాలు లభిస్తాయి.

గతంలో చేపట్టిన నీటి సరఫరా పనులకు, కార్యక్రమాలకు విభిన్నమైన రీతిలో జలజీవన్ మిషన్ కార్యక్రమాలను చేపట్టారు. నీటి సరఫరాకు అవసరమైన మౌలిక సదుపాయాలను నిర్మించడం మాత్రమే కాకుండా, నీటి పంపిణీ బాధ్యతలపై కూడా జలజీవన్ మిషన్ దృష్టిని కేంద్రీకరించింది. ఏ ఒక్క కుటుంబానికీ నీటి సరఫరా అందని పరిస్థితి ఎదురుకాకూడదన్న మూల సిద్ధాంతంతో జలజీవన్ మిషన్ పథకాన్ని చేపట్టారు. తద్వారా, సామాజిక, ఆర్థిక స్తోమతతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికీ కుళాయి ద్వారా నీరు లభించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. సుదూర ప్రాంతాలనుంచి నీటిని మోసుకువచ్చేందుకు ఎన్నో శతాబ్దాలుగా తల్లులు, సోదరీమణులు పడుతున్న ప్రయాసను తప్పించేందుకు, వారి ఆరోగ్యాన్ని, విద్యా, సామాజిక, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు జలజీవన్ మిషన్ పథకాన్ని చేపట్టారు. గ్రామీణ కుటుంబాలు సౌకర్యవంతమైన, గౌరవ ప్రదమైన జీవితం గడిపేలా చూడటమే ఈ పథకం ప్రధాన లక్ష్యం.

జల జీవన్ మిషన్ పథకం కింద కుళాయిల ద్వారా నీటి సరఫరాను ఏర్పాటు చేసేందుకు పలు అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. నీటి నాణ్యత దెబ్బతిన్న గ్రామాలకు, ఆశావహ జిల్లాలకు, షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగల జనాభా ప్రాబల్యం కలిగిన గ్రామాలకు, నీటి కొరతను ఎదుర్కొనే గ్రామాలకు, సంసద్ ఆదర్శ గ్రామ యోజన (ఎస్.ఎ.జి.వై.) అమలులో ఉన్న గ్రామాలకు ఈ పథకం కింద ప్రాధాన్యం




ఇస్తున్నారు. కడచిన 24 నెలల వ్యవధిలో ఇళ్లకు అమర్చిన నీటి సరఫరా కుళాయిల సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. దేశంలోని 117 ఆశావహ జిల్లాల పరిధిలో నీటి సరఫరా అందుకుంటున్న కుటుంబాల సంఖ్య 24 లక్షల నుంచి (7.17శాతం నుంచి), 1.37కోట్లకు (40శాతానికి) పెరిగింది.

అలాగే, మెదడు వాపు వ్యాధి (జపనీస్ ఎంసెఫలిటీస్), అక్యూట్ ఎంసెఫలిటీస్ సింద్రోమ్ వ్యాధితో ప్రభావితమైన 61 జిల్లాల్లోని 1.15 కోట్ల ఇళ్లకు (అంటే 38శాతం ఇళ్లకు) నీటి కుళాయిలను ఏర్పాటు చేశారు. జలజీవన్ మిషన్ పథకం ప్రకటించడానికి ముందునాటి పరిస్థితిని పరిశీలించినపుడు, మెదడు వాపు వ్యాధితో ప్రభావితమైన జిల్లాల్లో 8 లక్షల ఇళ్లకు (అంటే 2.64శాతం ఇళ్లకు) మాత్రమే నీటి కుళాయిలు అందుబాటులో ఉండేవి. ఇక నీటి నాణ్యత సరిగా లేని ప్రాంతాల్లో ఉపరితల నీటి సరఫరా వ్యవస్థల ఏర్పాటుకు మరింత వ్యవధి పట్టే అవకాశం ఉన్నందున, తాత్కాలికంగా, సామూహిక నీటి శుద్ధీకరణ ప్లాంటులను ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటిలో ఒక్కొక్కరికీ రోజూ 8నుంచి 10లీటర్ల చొప్పున శుద్ధిచేసిన సురక్షితమైన నీటిని సరఫరా చేసే లక్ష్యంతో ఈ ప్లాంటులను ఏర్పాటు చేశారు.

దేశవ్యాప్తంగా పాఠశాలల్లో, అంగన్ వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారుల ఆరోగ్యం, సంక్షేమం కాపాడే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వందరోజుల ప్రచారోద్యమ కార్యక్రమాన్ని ప్రకటించారు. 2020వ సంవత్సరం అక్టోబరు 2న కేంద్ర జలశక్తిమంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటి వరకూ, అంటే 16 నెలల వ్యవధిలో దేశవ్యాప్తంగా 8.47లక్షల పాఠశాలలకు (82శాతం), 8.67లక్షల అంగన్ వాడీ కేంద్రాలకు (78శాతం) కుళాయిల ద్వారా నీటిని ఏర్పాటు చేశారు. తాగునీటి అవసరాలకు, మధ్యాహ్నం భోజనం తయారీకి, మరుగుదొడ్లలో వినియోగ అవసరాలకు ఈ నీటి కుళాయిలను ఏర్పాటు చేశారు.

దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో 93 వేలవరకూ వర్షపునీటి సంరక్షణ సదుపాయాలు, లక్షా 8వేల మురుగునీటి శుద్ధి, పునర్వినియోగ నిర్మాణాలు ఏర్పాటు చేశారు. అండమాన్–నికోబార్ దీవులు, ఆంధ్రప్రదేశ్, దాద్రా–నాగర్ హవేలీ, డయ్యూ–డామన్, గోవా, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కాశ్మీర్, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, సిక్కిం, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని పాఠశాలన్నింటిలోనూ కుళాయిల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేశారు. మిగిలిన స్కూళ్లలో, అంగన్ వాడీ కేంద్రాల్లో సాధ్యమైనంత త్వరగా పరిశుద్ధమైన కుళాయి నీటిని అందుబాటులోకి తేవాలని కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది.

జలజీవన్ మిషన్ పథకంలో ప్రజాసంఘాలకు, కీలకపాత్ర ఉంటుంది. ప్రణాళిక దశనుంచి అమలు దశ వరకూ, నీటి సరఫరా సదుపాయాల నిర్వహణ వరకూ వరకూ ప్రజా సంఘాలు కీలకపాత్ర పోషిస్తాయి. ఇందుకోసం గ్రామ నీటి సరఫరా, పారిశుద్ధ్య కమిటీలు (వి.డబ్ల్యు.ఎస్.సి.), పానీ సమితులు ఏర్పాటు చేసి వాటిని మరింత బలోపేతం చేస్తున్నారు. గ్రామ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికను ప్రజాసంఘాల ప్రమేయంతోనే రూపొందిస్తున్నారు; పథకం అమలుచేయడం, ప్రజల్లో అవగాహన కల్పించడం తదితర అంశాల్లో గ్రామ స్థాయి ప్రజా సంఘాలకు సహాయ పడేందుకుగాను,.. పలు మద్దతు ఏజెన్సీలను (ఐ.ఎస్.ఎ.లను) వినియోగిస్తున్నారు. ఇప్పటి వరకూ దేశవ్యాప్తంగా 4.70లక్షల వరకూ వి.డబ్ల్యు.ఎస్.సి.లు (పానీ సమితులు) ఏర్పాటయ్యాయి. 3.83 లక్షలకు పైగా గ్రామ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించగలిగారు.

జలజీవన్ మిషన్ పథకం కింద చేపట్టే పనుల్లో పారదర్శకత, జవాబ్దారీతనం లక్ష్యంగా ఈ పథకంపై పూర్తి సమాచారాన్ని పబ్లిక్ డొమైన్.లో, జలజీవన్ మిషన్ డ్యాష్ బోర్డులో పొందుపరిచారు. ఇంటర్నెట్.లో ఈ లింకు (ష్టబిబిజూబ:// వతీజీశ్రీబష్ట్రజీనిబితి.ఇనీల.తిని/తీతీఎతీవజూనీతీబి/ఏఏఓఎనిటతిజీ.జీబజూలీ) ద్వారా పథకంపై పూర్తి సమాచారాన్ని ఎవరైనా తెలుసుకోవచ్చు.

# పెండింగ్ చలాన్లు ఉన్నవారికి త్వరలో గుడ్ న్యూస్, ఫైన్- భారం కాకుండా రాయితీకి ఏర్పాట్లు..

హైదరాబాద్, ఫిబ్రవరి 19:ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా ఇ–చలాన్లు అందుకుంటూ, ఆర్థిక సమస్యలతో వాటిని కట్టకుండా పెండింగ్‌లో పెట్టిన వాహనదారులకు హైదరాబాద్ పోలీసులు గుడ్ న్యూస్ చెప్పనున్నారు. పెండింగ్‌లో ఉన్న చలానాలు కట్టేందుకు వీలుగా రాయితీలు ప్రకటించనున్నారు. రెండేళ్లుగా కరోనా వైరస్ ప్రభావంతో ప్రజలు, వాహనదారుల ఆర్థిక పరిస్థితులు బాగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఇలాంటి ట్రాఫిక్ ఉల్లంఘనులకు ఉపశమనం కలిగిస్తూ పెండింగ్ చలాన్లలో రాయితీని ఇవ్వాలని హైదరాబాద్ పోలీసులు నిర్ణయించుకున్నారు. రాయితీ మొత్తం, తదితర వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు, పెండింగ్ చలాన్లపై కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఇతర ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. చలానాల్లో రాయితీ ఇవ్వడం ద్వారా వాహనదారులు జరిమానాలు చెల్లించే అవకాశాలున్నాయని అభిప్రాయం వ్యక్తం కావడంతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు.

ఇకపై రాత్రి వేళల్లోనూ ట్రాఫిక్ పోలీసుల విధులు..

ట్రాఫిక్ పోలీసులు రాత్రి 10 గంటల వరకే విధుల్లో ఉంటున్నారు. ఈనేపథ్యంలో నగరంలో రాత్రి పూటనే ఎక్కువగా వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని హైదరాబాద్ పోలీస్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదాలను అరికట్టేందుకు వీలుగా ఇకపై రాత్రి 11 నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకూ ట్రాఫిక్ పోలీసులకు ప్రత్యేక షిఫ్ట్‌ను అమలు చేయనున్నారు. రాత్రి వేళ ప్రమాదాలు అధికంగా నమోదువుతోన్న జూబ్లీ హిల్స్, బంజారా హిల్స్, ట్యాంక్ బండ్, మలక్ పేట, సికింద్రాబాద్, తిరుమలగిరి, బోయినపల్లి ప్రాంతాల్లో ప్రత్యేకంగా పోలీసులను ఏర్పాటు చేయనున్నారు. కాగా, రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు జరిమానాలు విధిస్తున్నామని ట్రాఫిక్ విభాగం సంయుక్త కమిషనర్ రంగనాథ్ తెలిపారు. మోటార్ వాహన సవరణ చట్టం ప్రకారం మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడితే రూ. 10 వేల వరకు ఫైన్? విధిస్తామని, డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు

## ఇచ్ఛాపురంలో గాంధీ పార్కు అభివృద్ధికి శ్రీకారం



అమరావతి, ఫిబ్రవరి 19:ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని గాంధీ పార్కు అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

14వ ఆర్థిక సంఘం నిధులు రూ.40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనులను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.

మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మితో కలసి ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పార్కు అభివృద్ధి,సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. తదనంతరం బెల్లుపడలోని లోపింటి వీధిలో గల "శ్రీ శ్రీ శ్రీ ఉమా మహేశ్వర దేవాలయాన్ని" సందర్శించారు.

# నిన్న కూలీలు.. నేడు వాహనాల యజమానులు



కరీంనగర్ ఫిబ్రవరి 19: (నేటినిజం ప్రతినిధి): : నిన్న కూలీలు, వాహన డ్రైవర్లుగా పనిచేసిన వారు నేడు వాహనాలకు యజమానులుగా మారడం గొప్ప విషయమని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దళిత కుటుంబాల్లో వెలుగులు నింపేందుకే సీఎం కేసీఆర్ దళిత బంధు (ఆజీశ్రీతిబిష్ట్రజీ ఎజీనిటష్ట్రబీ) పథకం ప్రవేశపెట్టారని చెప్పారు. కరీంనగర్‌లోని ఇండోర్ స్టేడియం వద్ద మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి లబ్ధిదారులకు యూనిట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పథకంతో దళితులు అభివృద్ధి చెందుతారన్నారు. దళిత కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షలు అందజేసిన మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడారు.

దళిత బంధు పథకం నిరంతర ప్రక్రియ అని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు స్వయంఉపాధిగా లాభసాటి యూనిట్లను ఎంపిక చేసుకుని ఆర్థికంగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రస్తుతం హుజూరాబాద్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని నాలుగు మండలాల్లో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. యూనిట్లను అందుకున్న తర్వాత దళితుల కుటుంబాల్లో ఆనందం కనబడిందని, దీంతో తమకు కూడా సంతోషం కలిగిందన్నారు. నేడు 146 మంది లబ్ధిదారులకు 63 యూనిట్లుగా రూ.15,30,84,413 విలువ చేసే వాహనాలను అందించామన్నారు.

దళిత బంధు పథకం దళితుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. లబ్ధిదారులకు యూనిట్లను పంపిణీ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఏడాది రాష్ట్రం మొత్తం దళితబంధు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని వెల్లడించారు. ఈ పథకం ద్వారా అందుకున్న యూనిట్లను సక్రమంగా నడిపించుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## ఏపీలో కొత్తగా 425 కరోనా కేసులు.. ఇద్దరు మృతి

అమరావతి, ఫిబ్రవరి 19: ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 425 కరోనా కేసులు నమోదయ్యాయి. ఇద్దరు కరోనాతో మృతి చెందారని ఏపీ వైద్యాధికారులు తెలిపారు . 1,486 మంది బాధితులు కోలుకున్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 7,358 యాక్టివ్ కేసులు ఉన్నాయని వారు వెల్లడించారు. 19,769 మందికి కరోనా పరీక్షలు నిర్వహించామని చెప్పారు. రాష్ట్రంలో కరోనా కేసులు భారీ ఎత్తున తగ్గుతుండడంతో ప్రభుత్వం కొవిడ్ ఆంక్షలను ఎత్తివేస్తుంది.

సినిమా థియేటర్లలో 50శాతం వరకు ఉన్న ఆక్యుపెన్సీని వంద శాతం వరకు పెంచుకోవచ్చని ఆంక్షలను సడలించింది. సచివాలయంలో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ విధులకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేస్తు ఉత్తర్వులు ఇచ్చింది.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా నమస్సులు అర్పించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భం లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయన కు నమస్సులు అర్పించారు. ఆయన సర్వోత్కృష్ట మైనటువంటి నాయకత్వం మరియు సామాజిక సంక్షేమానికి ఆయన కట్టబెట్టిన అగ్రతాంబూలం అనే అంశాలు ప్రజల కు తరాల తరబడి ప్రేరణ ను అందిస్తూ వస్తున్నాయి అని కూడా ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

"ఛత్రపతి శివాజీ మహారాజ్ కు ఆయన జయంతి సందర్భం లో నేను ప్రణామాన్ని ఆచరిస్తున్నాను. సర్వోత్కృష్ట మైన ఆయన నాయకత్వం మరియు సామాజిక సంక్షేమానికి ఆయన అగ్రతాంబూలాన్ని కట్టబెట్టడం అనేటటువంటి అంశాలు ప్రజల కు తరాల తరబడి ప్రేరణ ను అందిస్తూ వస్తున్నాయి. సత్యం మరియు న్యాయం అనే విలువల కోసం నిలబడడం లో రాజీ పడడం అనేది ఆయన ఎరుగనే ఎరుగరు. ఆయన కన్న కలల ను నెరవేర్చడానికి మేం కంకణం కట్టుకొన్నాం." అని పేర్కొన్నారు.

## మన ఊరు - మన బడికి పువ్వాడ 50 లక్షలు

ఖమ్మం, ఫిబ్రవరి 19:: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'మన ఊరు ? మన బడి' కార్యక్రమానికి తాను సొంతంగా రూ.50 లక్షల సాయాన్ని అందిస్తానని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రకటించారు. శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగిన 'మన ఊరు ? మన బడి' సమీక్షలో మంత్రి అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం సీఎం చేస్తున్న కృషికి తనవంతుగా చేయూతనందిస్తానని తెలిపారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి విదేశాల్లో ఉన్న ప్రముఖులు, ఇతర వ్యాపారవేత్తలను ఈ కార్యక్రమంలో సంఘటితం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకొని ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు ఈ బృహత్తర కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. తాను ప్రకటించిన సాయాన్ని త్వరలోనే ఖమ్మం కలెక్టర్‌కు అందజేస్తానని మంత్రి తెలిపారు.

# ఏపీపీఎస్సీ చైర్మన్‌గా గౌతమ్ సవాంగ్.. ఉత్తర్వులు జారీచేసిన సర్కార్



అమరావతి, ఫిబ్రవరి 19: ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ గౌతమ్ సవాంగ్ ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. గౌతమ్ సవాంగ్.. 1986 బ్యాచ్‌కి చెందిన ఐపీఎస్ అధికారి. ఆయన 2019, మే 30న ఆంధ్రప్రదేశ్ డీజీపీగా బాధ్యతలు చేపట్టారు. అయితే ఇంకా ఏడాది పాటు పదవీకాలం ఉండగానే మూడు రోజుల క్రితం ప్రభుత్వం ఆయనను బదిలీ చేసింది. అనంతరం ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమించింది.

1986 బ్యాచ్‌కు చెందిన సవాంగ్.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా మదనపల్లె ఏఎస్పీగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. అనంతరం చిత్తూరు, వరంగల్ జిల్లాలకు ఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. 2001 నుంచి 2003 వరకు వరంగల్ రేంజి డీఐజీగా, 2003-2004 వరకు స్పెషల్ బ్రాంచ్ డీఐజీగా, 2004-2005 వరకు ఏపీఎస్పీ డీఐజీగా పనిచేశారు.

2005 నుంచి 2008 వరకు సీఆర్పీఎఫ్ డీఐజీగా, 2008-2009 వరకు శాంతిభద్రతల విభాగం ఐజీగా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ సర్వీసుల్లోకి వెళ్లిన ఆయన 2016-2018 వరకు విజయవాడ సీపీగా, 2018 జులైలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. 2019 ఆగస్టు 3న ఏపీ డీజీపీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. 2023, జూలైలో పదవీ విరమణ చేయనున్నారు.

# యాదాద్రిలో శ్రీసుదర్శన నారసింహ మహాయాగం వాయిదా

యాదాద్రి, ఫిబ్రవరి 19:: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ మహాకుంభ సంప్రోక్షణలో భాగంగా తలపెట్టిన శ్రీసుదర్శన నారసింహ మహాయాగం వాయిదాపడింది. వచ్చే నెల 21 నుంచి మహాయాగాన్ని నిర్వహించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. అయితే ఆలయాభివృద్ధిలో బాగంగా చేపట్టిన కట్టడాలు పూర్తికాకపోవడంతో నారసింహ మహాయాగాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. ఆలయ ఉద్ఘాటన తర్వాత కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

కాగా, మూలవర్యుల దర్శనం మాత్రం గతంలో నిర్ణయించినట్లుగానే మార్చి 28న ప్రారంభమవుతుందని తెలిపారు. మహాకుంభ సంప్రోక్షణ చేపట్టిన తర్వాత ప్రధాన ఆలయంలోకి భక్తులను అనుమతిస్తామని చెప్పారు. ప్రస్తుతం నారసింహుడు కొలువై ఉన్న బాలాలయాన్ని మార్చి 27 వరకు కొనసాగిస్తామన్నారు. ఈ నెలాఖరులో ఆలయ రాజగోపురాలపై స్వర్ణ కలశాల స్థాపనచేపడతామని పేర్కొన్నారు.

# ప్రశాంత్ కిషోర్‌తో భేటీకి ఎలాంటి ప్రత్యేకత లేదు : నితీష్ కుమార్

పట్నా,ఫిబ్రవరి 19: బీజేపీతో జేడీ(యూ) తెగదెంపులు చేసుకోవచ్చనే ఊహాగానాల నడుమ బిహార్ సీఎం నితీష్ కుమార్‌తో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సమావేశమవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీలో సీఎం అధికార నివాసంలో నితీష్‌తో ప్రశాంత్ కిషోర్ శనివారం దాదాపు రెండు గంటల పాటు సమావేశమయ్యారు. 2020లో పార్టీ ఉపాధ్యక్ష పదవి నుంచి జేడీ(యూ) ప్రశాంత్ కిషోర్‌ను తొలగించిన తర్వాత వీరు సమావేశం కావడం ఇదే తొలిసారి. ఇక ఈ భేటీకి ఎలాంటి ప్రాధాన్యత లేదని సమావేశం అనంతరం నితీష్ వ్యాఖ్యానించారు.

ప్రశాంత్ కిషోర్‌తో తన అనుబంధం ఈరోజే మొదలైందా అని నితీష్ ప్రశ్నించారు. సమావేశం వెనుక ఎలాంటి ప్రత్యేక కారణాలు లేవని ఇరువురి భేటీపై సాగిన ఊహాగానాలకు నితీష్ తెరదించారు. మరోవైపు నితీష్ త్వరలోనే మధ్యంతర ఎన్నికలకు వెళతారని ఆయన మధ్యంతర సీఎం అని లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ ఇటీవల వ్యాఖ్యానించారు.

మధ్యంతర ఎన్నికల కోసం నితీష్ సాకులు వెతుకుతున్నారని కూడా పాశ్వాన్ ఆరోపించారు. బీజేపీ నుంచి వేరుపడేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని చెప్పుకొచ్చారు. సీఎం పదవి కోసం నితీష్ ఎంతవరకైనా వెళతారని, ఇతర పార్టీలతో సంప్రదింపులు జరిపి 2017లో తీసుకున్న చర్యలతో తిరిగి ముందుకొచ్చినా ఆశ్చర్యం లేదని పాశ్వాన్ పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరూ సమాజసేవ చేయాలి.. : డా॥ ఆనంద్

హైదరాబాద్, ,ఫిబ్రవరి 19: : బంజారా మహిళా ఎన్జీవో ఫౌండర్ డా.ఆనంద్, చైతన్య పోలోజు సంయుక్తంగా ఇప్పటికే ఎన్నో సేవాకార్యక్రమాలు చేశారు. తాజాగా.. హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, యాద్రాద్రి, భువనగిరి, జిల్లాల్లో ఉన్న అనాథ, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, సాంఘీక సంక్షేమ వసతి గృహాలు, దివ్యాంగులు, రైతులు, పేదవారికి సహాయ సహకారాలను అందించారు. ఇలా ఎన్నో సేవలు చేస్తూ వీరు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా డా. ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలన్నారు. తమ దైనందిన జీవితంలో భాగంగా అభాగ్యులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. తనకు సహకరిస్తున్న చైతన్య, ఇతర మిత్రులందరికీ ఈ సందర్భంగా ఆనంద్ ధన్యవాదాలు తెలిపారు.

# కుమార్ విశ్వాస్‌కు 'వై' కేటగిరీ భద్రత.. హోంశాఖ నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:ఇటీవలే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై సంచలన ఆరోపణలు చేసిన ఆప్ మాజీ నేత కుమార్ విశ్వాస్‌కు వై కేటగిరీ భద్రత కల్పిస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకుంది. అరవింద్ కేజ్రీవాల్‌పై సంచలన ఆరోపణలు చేసిన నేపథ్యంలోనే కేంద్ర హోంశాఖ ఆయనకు వై కేటగిరీ భద్రత కల్పించింది. ఇకపై కమాండోలు కుమార్ విశ్వాస్ భద్రతను చూసుకుంటారని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు కుమార్ విశ్వాస్‌కు భద్రత కల్పించే విషయంపై హోంశాఖ సమీక్ష నిర్వహించింది. కుమార్ విశ్వాస్‌కు ముప్పు పొంచి వుందన్న నిఘా వర్గాల సమాచారంతో ఆయనకు వై కేటగిరీ భద్రత కల్పిస్తున్నట్లు హోంశాఖ ఈ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. ఈ భద్రతలో మొత్తం 11 మంది సెక్యూరిటీ ఉంటారు. ఈ 11 మందిలో ఇద్దరు సీఆర్పీఎఫ్ కమాండోలు. ఇందులో కొంత మంది కుమార్ విశ్వాస్ నివాసం వద్ద భద్రతలో ఉంటారు. మిగతా వారు కుమార్ విశ్వాస్ ఎటు వెళ్లినా? ఆయన వెంటే ఉంటారు. షిఫ్టుల ప్రకారం వీరు విధులు నిర్వర్తిస్తుంటారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై ఆప్ మాజీ నేత కుమార్ విశ్వాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఏదో ఒక రోజు పంజాబ్ ముఖ్యమంత్రి అయినా, లేదంటే ఖలిస్తాన్ ప్రధాని అయినా అవుతానని సీఎం కేజ్రీవాల్ తనతో అన్నారని కుమార్ విశ్వాస్ వెల్లడించారు. పంజాబ్ అంటే సీఎం కేజ్రీవాల్‌కు ఏమాత్రం అర్థం కాలేదని ఎద్దేవా చేశారు. పంజాబ్ అంటే రాష్ట్రం కాదని, అదో భావన అని ఆయన పేర్కొన్నారు. 'నేను మొదటి నుంచి చెబుతూనే వస్తున్నా. వేర్పాటువాదులు ఖలిస్తాన్ ఉద్యమానికి మద్దతిచ్చే వారితో కలవొద్దని నేను చెప్పాను. కాదు.. కాదు.. నేను కలుస్తానని అన్నారు. ఏమీ ఆలోచించాల్సిన పనిలేదన్నారు. అయితే వేర్పాటువాదులతో చేతులు కలపొద్దని నేను అన్నాను. ఏమవుతుంది నేనే మొట్ట మొదటి ప్రధాని అవుతా. అని కేజ్రీవాల్ అన్నారు. అలాగే పంజాబ్ సీఎం కావడానికి కూడా ఆయన ప్రణాళికలు వేసుకున్నారు. ఇప్పటికీ ఆ ఊహల్లోనే వుంటారు అని' కుమార్ విశ్వాస్ వెల్లడించారు. అధికారం కోసం కేజ్రీవాల్ ఏమైనా చేయగలరని కుమార్ విశ్వాస్ విమర్శించారు.

# బ్రిటన్‌లో తుపాను బీభత్సం.. గాలివాన వేగానికి కొట్టుకుపోతున్న జనం..



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:యూకేలో తుపాను బీభత్సం సృష్టిస్తోంది. యూనిస్ తుఫాను బ్రిటన్?లోని దక్షిణాదిని ఆగమాగం చేస్తోంది. ఇంగ్లండ్‌లో ఎన్నడూ లేనంత బలమైన తుపానుగా దీన్ని పేర్కొంటున్నారు అధికారులు. గంటకు 196 కిలో మీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తున్నాయని, దీంతో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతూ బీభత్సం సృష్టిస్తున్నట్టు జఐ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ తుఫాను బెల్జియం, ఐర్లాండ్, నెదర్లాండ్స్ తో సహా ఇతర ఉత్తర యూరోపియన్ దేశాలను కూడా వణికిస్తోంది.

యూనిస్ తుపాను బీభత్సంతో బ్రిటన్‌లో పదుల సంఖ్యలో వ్యక్తులు చనిపోయారు. దక్షిణ ఇంగ్లండ్‌లో కారు చెట్టును ఢీకొనడంతో ఒక వ్యక్తి, వాయువ్య ఇంగ్లాండ్‌లో శిధిలాల ద్వారా విండ్‌షీల్డ్ ను తాకి మరొక వ్యక్తి.. లండన్‌లో కారుపై చెట్టు పడడంతో 30 ఏళ్ల మహిళతో సహా మరొకరు చనిపోయినట్టు ప్రాథమిక సమాచారం అందినట్టు పోలీసులు చెప్పారు. నెదర్లాండ్స్‌లో, ఆమ్‌స్టర్ డ్యామ్, చుట్టుపక్కల చెట్లు పడిపోవడం వల్ల ముగ్గురు వ్యక్తులు మరణించారు. నాలుగో వ్యక్తి ఉత్తర ప్రావిన్స్ గ్రోనింగెన్‌లో పడిపోయిన చెట్టుపైకి తన కారును నడుపుతూ చనిపోయాడు.

బెల్జియన్ పట్టణంలోని టోర్నైలో బలమైన గాలులు ఆసుపత్రి పైకప్పుపైకి దూసుకొచ్చాయి. ఇక్కడ ఎంతమంది చనిపోయారన్న విషయాలు మాత్రం తెలియలేదు. అయితే స్థానిక మీడియా పూర్తి వివరాలు ఇవ్వకుండా కొద్దిపాటి గాయాలయ్యాయనే ప్రచారం చేస్తోంది.

బలమైన గాలుల మధ్య ఉత్తర పట్టణమైన యిప్రెస్‌లోని జలమార్గంలో మెరీనా వద్ద తన పడవ నుండి పడిపోయిన 79 ఏళ్ల బ్రిటిష్ వ్యక్తి చనిపోయినట్టు తెలుస్తోంది. ఐర్లాండ్‌లోని కౌంటీ వెక్స్ ఫోర్డ్‌లో చెట్టు పడిపోయిన ఘటనలో స్థానిక ప్రభుత్వ ఉద్యోగి మరణించినట్లు స్థానిక కౌన్సిల్ తెలిపింది. యూనిస్ తుపాను ఈ వారం యూరప్‌ను తాకిన రెండో అతిపెద్ద తుఫాను. మొదటి తుఫాను జర్మనీ, పోలాండ్‌లో బీభత్సం సృష్టించింది. తూర్పు అట్లాంటిక్ మహాసముద్రంపై బలమైన జెట్ స్ట్రీమ్ కారణంగా తుపాను ప్రబలిందని, అందుకనే అధిక ఎత్తులో 321 ఎజూష్ట్ర వేగంతో గాలులు వీస్తున్నాయని ఇంగ్లండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్‌లోని వాతావరణ శాస్త్రవేత్త పీటర్ ఇన్‌నెస్ చెప్పారు.

తుఫానుతో ఇంగ్లాండ్, వేల్స్ లో ప్రయాణాలకు అంతరాయం కలిగింది. అనేక రైలు సేవలు నిలిపివేశారు. విమానాలు, ఫెర్రీ సేవలను కూడా రద్దు చేశారు. కొన్ని బ్రిటీష్ విమానాశ్రయాల్లో గాలివానతో విమానాలు బలంగా నేలను తాకాయి. పైలట్‌లు ల్యాండింగ్‌లను వదిలివేయవలసి వచ్చింది. వాతావరణ మార్పు ఐరోపాలో మరింత హింసాత్మక తుఫానులకు దారితీస్తోందని ఎటువంటి రుజువు లేదని ఇంపీరియల్ కాలేజీకి చెందిన వాతావరణ శాస్త్రవేత్త ఫ్రైడెరిక్ ఒట్టో పేర్కొన్నారు.

# ఖమ్మంలో మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం.. ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్



ఖమ్మం, ఫిబ్రవరి 19:సద్వినియోగం దిశగా యోచిస్తే వ్యర్థానికి ఓ అర్థముంటుంది. ఆ అర్థం వెనుక ప్రయోజనం దాగి ఉంటుంది. ఖమ్మం పట్టణంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో అందుబాటులోకి రాబోతున్న మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం అందుకు దర్పణం పడుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏకైక కేంద్రంగా ప్రత్యేకత చాటుతోంది. రూ.5.48 కోట్లతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దానవాయిగూడెం డంపింగ్ యార్డు వద్ద 'మానవ విసర్జితాల శుద్ధీకరణ' (ఎఫ్ఎస్‌టీపీ) కేంద్రాన్ని రాష్ట్ర పురపాలక శాఖ అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ఖమ్మం ఆదర్శ నగరంగా అనేక అంశాల్లో ముందంజలో నిలుస్తోంది. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేక చొరవతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. మానవ వ్యర్థాల నుంచి ఎరువును తయారు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇదే క్రమంలో మురుగు (వ్యర్థ)ను శుద్ధి చేసి మొక్కలకు నీరందిస్తూనే స్థానిక అవసరాలను తీర్చేందుకు కృషి చేయనున్నారు.


పట్టణాలు, పల్లెల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి చేస్తూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నది. ప్రజారోగ్యానికి పరిశుభ్రత అంత్యంత అవసరమని, వ్యర్థాలను కూడా శుద్ధి చేయడం వల్ల పరిసరాలు కలుషితం కాకుండా చూసుకోవచ్చనే ధృడ నిశ్చయంతో ఖమ్మం నగరంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శ్రీ పువ్వాడ అజయ్ కుమార్ కృషి ఫలితంగా ఈ కేంద్రం అతి త్వరలోనే రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి శ్రీ కేటీఆర్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఖమ్మం పట్టణంలో నివాస గృహాల సెప్టిక్ ట్యాంక్‌ల నుంచి సేకరించిన మానవ విసర్జితాలను శుద్ధీకరణ చేసి ఎరువు తయారు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎఫ్ఎస్‌టీపీ కేంద్రంలో అనారోబిక్ సేఫ్టీలైజేషన్ రియాక్టర్‌లో విసర్జితాలను మెథనైజేషన్ పద్ధతిలో శుద్ధి చేసి విసర్జితం, నీటిని వేరు చేస్తారు. నీటిని పాలిషింగ్ ఫండ్‌లో పాస్పరేట్, సల్ఫర్ ద్వారా శుద్ధిచేసి ప్యూరిఫైడ్ వాటర్‌గా మార్చుతారు. 18 రోజుల తర్వాత మలం ఎరువుగా మారుతుంది. నీటిని మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో హరిత హారం మొక్కలు కొరకు వినియోగిస్తారు.

# టీటీడీ చైర్మన్‌గా వైవి సుబ్బారెడ్డి అధర్మ పాలన



తిరుపతి, ఫిబ్రవరి 19:టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిపై జనసేన నేతలు తీవ్రంగా మండిపడ్డారు. దశాబ్దాల కాలంగా ఉన్న ఏ పాలకమండలి చేయని, దోపిడిని సుబ్బారెడ్డి హయంలో జరుగుతున్నాయని ఆరోపించారు. చైర్మన్ సుబ్బారెడ్డి పాలనలో పూర్తి అధర్మంగా కొనసాగుతుందని జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ ఇంచార్జ్ కిరణ్ రాయల్ ఆరోపించారు. దోచుకోవడమే ధ్యేయంగా వైసిపి ఆశీస్సులతో శ్రీవారి ఆల య ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యవహ రిస్తున్నారని దుయ్యంబట్టారు. ఉదయాస్త మాన సేవల దర్శనాన్ని ప్రవేశపెట్టి.. వాటిని బోర్డు మెంబర్లు పంచుకుంటూ కోట్ల రూపా యల వ్యాపారాలు చేసుకోవడం బాధాకర మన్నారు. కొత్త సినిమా టికెట్ల కోసం కొట్టుకున్నట్లు టీటీడీ పాలక మండలి సభ్యులు ఈ టికెట్ల దందాలో కీచులాడు కుంటున్నారని చెప్పారు. బోర్డు మెంబర్ల అవినీతి బాగోతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోందన్నారు. దీనిపై భక్తులకు వివరణ ఇవ్వాలని జనసేన పార్టీ నేతలు డిమాండ్ చేశారు.

# మంత్రి సత్యవతి రాథోడ్‌ను పరామర్శించిన నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 19: రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తండ్రి లింగ్యా నాయక్ రెండు రోజుల క్రితం కన్నుమూశారు.

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీఎస్ ఫుడ్స్ డీజీఎం కృష్ణవేణి, మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ బిందు, ఎమ్మెల్యే శంకర్ నాయక్, కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ నేతలు మంత్రిని పరామర్శించారు.

ఈ సందర్భంగా లింగ్యా నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించి, కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకుశాంతిచేకూరాలని ఆకాంక్షించారు.

# నేడు నరసాపురంకు పవన్ కళ్యాణ్

హైదరాబాద్, ఫిబ్రవరి 19:జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రేపు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంకు వెళ్తున్నారు. నరసాపురం రుస్తుం బాద్‌లో రేపు సాయంత్రం 'మత్స్యకార అభ్యున్నతి సభ' నిర్వహించాలని జనసేన పార్టీ నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ హాజరై ప్రసంగించనున్నారు.

మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంపొందించేలా వృత్తిపరమైన ఉపాధి భరోసా, మత్స్యకారుల డిమాండ్ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా మిగిలిపోయాయి. ప్రభుత్వంలోని పెద్దలకు వీటిపై దృష్టి పెట్టే సమయం, ఆలోచన రెండూ లేవంటూ ఫిబ్రవరి 13వ తేదీ నుంచి మత్స్యకారుల కోసం జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ యాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే రేపు ఈ సభ నిర్వహించనున్నారు. హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం మధురపూడి విమానాశ్రయానికి పవన్ కళ్యాణ్ చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన నరసాపురానికి చేరుకుంటారు. మత్స్యకారుల ఉపాధిని దెబ్బ తీసే విధంగా ఉన్న 217 జీవోపై గళమెత్తడానికి పవన్ కళ్యాణ్ వస్తున్నట్లుగా పార్టీ తెలిపింది.

# గ్రామీణ బ్యాంక్‌లో భారీ చోరీ - బ్యాంక్ ఖాతా నుండి రూ.1.28కోట్లు మాయం



ఆదిలాబాద్, ఫిబ్రవరి 19:ఆదిలాబాద్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లో భారీ మోసం చోటు చేసుకుంది. బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.28కోట్లు మాయమయ్యాయి. రైతుల కిసాన్ క్రెడిట్ కార్డుల నుంచి డబ్బులు డ్రా అయినట్లు గుర్తించారు. రైతుల కిసాన్ కార్డుల ద్వారా డబ్బు డ్రా చేశాడు నిర్వాహకుడు. దాంతో అప్రమత్తమైంది గ్రామీణ బ్యాంక్ యంత్రాంగం. ముగ్గురు ఆదివాసీ రైతుల కిసాన కార్డుల ద్వారా నగదుని డ్రా చేశాడు కస్టమర్ పాయింట్ నిర్వాహకుడు. ముగ్గురు రైతులకు రూ.16లక్షలు ముట్టచెప్పి మిగిలిన సొమ్మును కాజేశాడు రమేష్ అనే వ్యక్తి. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించారు బ్యాంక్ అధికారులు

# హిజాబ్ వివాదం: 58 మంది విద్యార్థినుల సస్పెండ్

బెంగళూరు, ఫిబ్రవరి 19:: హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు తర్వాత కూడా కర్ణాటకలో హిజాబ్ వివాదం వేడి తగ్గుముఖం పట్టడం లేదు. హిజాబ్‌తో తరగతులకు అనుమతించాలంటూ విద్యార్థినులు పట్టుబడుతుండటం, కాలేజీల యాజమాన్యాలు, పోలీసులు నచ్చచెప్పే ప్రయత్నాలు చేసినా సానుకూల ఫలితాలు రాకపోవడం వంటివి చోటుచేసుకుంటున్నాయి. శనివారంనాడు హిజాబ్ డిమాండ్‌పై వెనక్కి తగ్గని 58 మంది విద్యార్థినులను శివమొగ్గ జిల్లా షిరలకొప్పలోని ప్రీ యూనివర్శిటీ కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసింది.

ఇవి కూడా చదవండిఎఎజీణవ అజీజూబితినీనివాటిలో ప్రభుత్వ జోక్యం ఉండదు: అవిద్యార్థినులకు తాము ఎంత నచ్చచెప్పినప్పటికీ తమ డిమాండ్‌పై పట్టువీడకపోవడంతో వారిని కళాశాల నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేయాల్సి వచ్చిందని ప్రీ యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కాలేజీ అధికారులతో విద్యార్థినులు వాదనకు దిగడంతో పోలీసులు జోక్యం చేసుకుని వారిని అక్కడి నుంచి చెదరగొట్టారు.

హిజాబ్ ధరించిన విద్యార్థినులు తమను తరగతులకు హాజరు కానీయాలని డిమాండ్ చేయడంతో బెళగవి, యాద్‌గిర్, బళ్లారి, చిత్రదుర్గం, షిమోగా జిల్లాల్లో ఉద్రిక్తతలు తలెత్తాయి. బెళగవిలోని విజయ్ పారామెడికల్ కాలేజీ యాజమాన్యం నిరవధిక సెలవు ప్రకటించగా, హరిహరలోని ఎస్‌జేపీ కాలేజీలో తరగతులను విద్యార్థులు బహిష్కరించారు.

బళ్లారి సరళాదేవి కాలేజీలో హిజాబ్ ధరించిన విద్యార్థులను అనుమతించకపోవడంతో వారంతో ప్లేగ్రౌండ్స్‌లో సమావేశమయ్యారు. పోలీసులతో మాట్లాడేందుకు వారు నిరాకరించడంతో పాటు తమను డిస్ట్రబ్ చేయవద్దని పోలీసులను కోరారు. కొడగులో విద్యార్థినులు ప్లకార్డులు ధరించి గేటు ముందు నిరసన ప్రదర్శన చేశారు.కాగా, తాజా పరిణామాలపై హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర మాట్లాడుతూ, హిజాబ్ వివాదం అన్ని కాలేజీల్లోనూ లేదని, చాలా కొద్ది కాలేజీల్లోనే ఆందోళనకు జరుగుతుండగా, వారిని హెచ్చరించామని చెప్పారు. కాలేజీల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తామని అన్నారు. ఈ వివాదం వెనుక మతశక్తులు ఉన్నాయని, వారిపై కేసులు పెడతామని తెలిపారు. రాజ్యాంగం, కోర్టులను లెక్కచేయనవసరం లేదని ఎవరైనా భావిస్తే వారిని విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు.



# శివాజీ జయంతి వేడుకల్లో హిందూ సేన సభ్యులు...




రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 19:(నేటినిజం ప్రతినిధి):చత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో రాష్ట్ర హిందూ సేన సభ్యులు పాల్గొన్నారు. చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో శనివారం హిందూ సేన రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర వెలెందర్ గౌడ్ ఆధ్వర్యంలో శివాజీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివాజీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బండపల్లి ఎంపిటిసి గడ్డం రణధీర్ రెడ్డి. నాయకులు జవాజి ప్రసాద్. చింతలపల్లి సుదర్శన్. సురేష్. లండే శ్రీను తదితరులు పాల్గొన్నారు,

# ఎమ్మెల్యే రమేష్ బాబును మర్యాద పూర్వక కలిసిన నూతన ముస్లిం కమిటీ అధ్యక్షులు శాసనసభ్యులు చెన్నమనేని



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 19:(నేటినిజం ప్రతినిధి):రమేష్ బాబు ని శనివారం వేములవాడ టౌన్ ముస్లిం కమిటీ నూతన అధ్యకులు వారి కార్యవర్గం సభ్యులు మర్యాదపూర్వకంగా మర్యాదపూర్వకంగా కలిశారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యకులు మరియు వారి కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ మున్సిపల్ పరిధిలో కాని మరియు ఇతర గ్రామాల్లో కాని వారి యొక్క సమస్యలు వారి ప్రార్థనా మందిరాలు మెరుగు పరుచుకోవడం షాధికానాలు కట్టుకోవడం, వారి పాఠశాలలను మరమ్మతులు చేసుకోవడం, షాదీ ముబారక్ వంటి కార్యక్రమాలపై చర్చించుకోవడం జరిగింది. అలాగే పట్టణంలో షాదీఖానా నిర్మాణానికి అవసరమయ్యే దాదాపు 65 లక్షల నిధుల మంజూరీకి కృషి చేస్తానని, ముస్లిం సోదరులు కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు నడుస్తున్నాయని అలాగే వారి వక్ఫ్ బోర్డ్ భూముల సమస్యలను కలిసి పరిష్కరించుకుందామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సి చైర్మన్ గడ్డం హనుమాండ్లు , పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు , మైనార్టీ నాయకులు పీర్ మహమ్మద్ , కో ఆప్షన్ బాబూన్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీరు, త్రాగునీటికి శాశ్వత పరిష్కారం.!

### బతుకమ్మ తెప్ప చెక్ డ్యాం పనుల పరిశీలన.!

### పరిశీలించి వివరాలు తెలుసుకున్న శాసనసభ్యులు చెన్నమనేని రమేష్.




రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 19:(నేటినిజం ప్రతినిధి):ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ గారు మాట్లాడుతూ రాజరాజేశ్వరి జలాశయం నుండి ప్యాకేజీ 9 ద్వారా మల్కపేట రిజర్వాయర్ నింపుకొని దాని నుండి నిమ్మపల్లి ద్వారా మన మూలవాగు జీవనది కానున్నదన్నారు. దాదాపు 60 కోట్లతో ఈ మూలవాగుపై 12 చెక్ డ్యాంలు నిర్మాణ పనులు దాదాపు సగం పూర్తయ్యాయని అన్నారు. ఈ 12 చెక్ డ్యాంల నిర్మాణం ద్వారా మూలవాగు జీవనదిగా మారబోతున్నదని అలాగే భూగర్భజలాలు పెరగడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందని అన్నారు. దీనితో పాటు శాశ్వత త్రాగునీరు, సాగు నీరు సమస్య పరిష్కారం కాబోతుందన్నారు. ఇప్పటికే గుడి చెరువులో 365 రోజులు నీరు వుండే విధంగా 17 కోట్లతో లిఫ్ట్ ప్రారంభించమని, ఎల్లంపల్లి ద్వారా 55 వేల ఎకరాలకు సాగులోకి వచ్చిందన్నారు. పట్టణంలో మిషన్ భగీరథ ద్వారా త్రాగునీరు పనులు దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయని తద్వారా సాగునీరు, త్రాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతున్నాయి అన్నారు. నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకూడని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సీ చైర్మన్లు హనుమాండ్లు, పొన్నాల శ్రీనివాస్, కౌన్సిలర్లు ఇప్పపూల అజయ్, మధు, శేఖర్, కొండ కనకయ్య, ఇర్రిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి కేటీఆర్‌ను కలిసిన చల్మెడ..

### -మల్కపేట పాఠశాల ప్రభుత్వ పాఠశాల బిల్డింగ్ నమూనా అందజేత




కరీంనగర్ ఫిబ్రవరి 19: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర మంత్రి కేటీఆర్ ను టిఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహ రావు శనివారం కలిశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేట ప్రాథమికోన్నత పాఠశాల స్కూల్ బిల్డింగ్ నమూనాను అందజేశారు. మన ఊరు.. మన బడికి దాతలు విరాళాలు ఇచ్చి సహకరించాలని మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు కు.. చల్మెడ లక్ష్మి నరసింహరావు స్పందించారు. చల్మెడ తన స్వంత గ్రామమైన కొనరావుపేట మండలం మల్కపేట లో తన తల్లి చల్మెడ జానకీ దేవి పేరుమీద దాదాపు కోటిన్నర తో నిర్మించ దల్చిన ప్రభుత్వ స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి ముందుకొచ్చారు. నమూనాను చూసిన మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ తమ స్వంత ఊరు బడిని అభివృద్ధి చేయడం కోసం ముందుకు రావాలని.. లక్ష్మి నరసింహా రావు ను సేవా కార్యక్రమాల్లో రాష్ట్రంలో ఆదర్శ ప్రాయుడని పేర్కొన్నారు.

# తెలంగాణ పుట్టుకను ప్రశ్నిస్తున్న బీజేపీని తరిమేయండి : మంత్రి వేముల



నిజామాబాద్, ఫిబ్రవరి 19:మందికి పుట్టిన బిడ్డను ముద్దాడి మా బిడ్డే అనే నీచ స్థాయికి బీజేపీ దిగజారిందని రాష్ట్ర రోడ్లు-భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ పుట్టుకను ప్రశ్నిస్తున్న బీజేపీని తరిమికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే తెలంగాణ పల్లెలు అభివృద్ధి చెందాయని, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నందునే తెలంగాణ పల్లెలు ఇంత అద్భుతంగా అభివృద్ధి చేసుకుంటున్నామని మంత్రి చెప్పారు.

బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూర్, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లో రూ.5.11 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు-భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహెబ్ పేట, వెంకటాపూర్ గ్రామాల్లో మంత్రి మీడియాతో మాట్లాడారు.

నీచాతి నీచంగా దిగజారి మాట్లాడుతున్న బీజేపీ నాయకులను సీఎం కేసీఆర్ తిట్టడం వంద శాతం కరెక్టే అని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణకు మాత్రం మొండి చేయి చూపిందని మండిపడ్డారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, గుజరాత్ రాష్ట్రాలకు ఇచ్చినట్లు తెలంగాణ రాష్ట్రానికి నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా 87 నవోదయ విద్యాలయాలు ఇస్తే.. తెలంగాణకు ఒక్కటి కూడా ఎందుకు ఇవ్వలేదని, 157 మెడికల్ కాలేజీలు మంజూరు చేసిన కేంద్రం.. తెలంగాణకు ఒక్కటి కూడా ఎందుకు కేటాయించలేదన్నారు. నిధులు ఇవ్వడంలో వివక్ష చూపడమే కాకుండా తెలంగాణ పుట్టుకను ప్రశ్నిస్తున్నారని దుయ్యబట్టారు.

పార్లమెంట్ వేదికగా రాష్ట్ర విభజన సరిగా జరగలేదంటున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా మాటల వెనుక ఆంతర్యం ఏంటని మంత్రి వేముల ప్రశ్నించారు. తెలంగాణ ఎంపీలు మోదీని, అమిత్ షాను ఎందుకు అడగరని నిలదీశారు. రాష్ట్రం విడిపోయి ఎనిమిదేండ్లు అవుతున్నా.. స్వయంగా ప్రధానే పార్లమెంట్ వేదికగా పలు మార్లు రాష్ట్ర విభజన మీద మాట్లాడున్నారంటే కచ్చితంగా తెలంగాణ మీద జరుగుతున్న కుట్రలో భాగంగానే చూసామన్నారు. తెలంగాణను చిన్నచూపు చూస్తున్న బీజేపీ మాయలో పడితే గోస పడుతామని, తెలంగాణ ప్రజలు ముఖ్యంగా యువత దీనిపై ఆలోచన చేయాలని మంత్రి కోరారు.

# సంక్షేమ హాస్టళ్లను గాలికి వదిలేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

### టీఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మోతె రాజిరెడ్డి



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 19:(నేటినిజం ప్రతినిధి): టీఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం సిరిసిల్ల స్థానిక ప్రభుత్వ బాలుర సంక్షేమ హాస్టల్ ను సందర్శించి విద్యార్థుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నా టీ,ఎన్,ఎస్,ఎఫ కరీంనగర్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మోతె రాజిరెడ్డి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నట్టు రాష్ట్రంలో ప్రభుత్వ హాస్టళ్ల పరిస్థితి లేదు అని హాస్టల్ విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని,సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు సంబంధించి పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ ఛార్జీలు పెంచి వెంటనే నిధులు విడుదల చేయాలని, అలాగే పక్క భవనాలను నిర్మించాలని,మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు.

# ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి డా. జస్టిస్ షమీమ్ అక్తర్




రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 19:(నేటినిజం ప్రతినిధి):చిన్నారులపై లైంగిక దాడుల, అత్యాచార కేసులకు సత్వర పరిష్కారం చూపేందుకు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును జిల్లా కోర్టు సముదాయంలో నిర్మించారు. శనివారం ఈ ఫాస్ట్ ట్రాక్ కోర్టును హైకోర్టు న్యాయమూర్తి డా. జస్టిస్ షమీమ్ అక్తర్ ప్రారంభించారు. ముందుగా ఆయనకు పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సర్వమత ప్రార్థనలు చేసి దీవెనలు అందించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం చిన్నారులపై లైంగిక దాడులు, అత్యాచార కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టును రిబ్బన్ కట్ చేసి ఆయన ప్రారంభించారు. దీర్ఘకాలంగా పెండింగ్?లో ఉన్న కేసుల సత్వర పరిష్కారం కోసం చేస్తున్న కృషిలో భాగంగా ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేశామన్నారు. సత్వరన్యాయం కోసం ఏర్పాటుచేసిన ఈ కోర్టులు సమర్థవంతంగా పని చేసేలా అందరూ సహకరించాలని సూచించారు.

కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి ఎం.జీ.ప్రియదర్శిని, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ రాహుల్ హెగ్డే, రాజన్న సిరిసిల్ల 9 అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి ఎం.జాన్సన్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

# శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం..

# కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడి దుర్మరణం



ఖమ్మం, , ఫిబ్రవరి 19: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు సోమనపల్లి ఫకీర్ కుమార్ ఓ ప్రమాదంలో ఇవ్వాల చనిపోయారు. పాల్వంచలో ఉదయం జరిగిన ఒక వివాహ శుభ కార్యానికి సోదరుడు నాగులుతో ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా తిప్పనపల్లి బ్రిడ్జి వద్ద యాక్సిడెంట్ జరిగింది.

ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్ర గాయలపాలయ్యారు. క్షత గాత్రులను కొత్తగూడెం తరలించారు. ఈ లోపే పకీరకుమార్ చనిపోయారు.

విషయం తెలుసుకున్న చంద్రుగొండ మండల కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీ కొనకళ్ల వెంకట్ రెడ్డిగ్ర్భ్రాంతి వ్యక్తం చేశారు. హుటాహుటిన కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని పకీర్ కుమార్ మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు. పకీర్ మృతి పట్ల నాయకులు సురేష్, షాబీర్ హుస్సేయిన్, కృష్ణా రెడ్డి, రత్నాకర్, బాబు, పలువురు మిత్రులు సంతాపం ప్రకటించారు.

మీ కోసం

## నేటినిజం లో..

# 'స్వీయ పరిచయవేదిక' త్వరలో...

వారం, వారం వర్ధమానులు, ప్రవర్ధమానులు తమ రచనల్ని అందించడానికి అనువైన పత్రికగా భాసిల్లుతున్న 'నేటినిజం" మరో కొత్త శీర్షికకు త్వరలో శ్రీకారం చుట్టబోతోంది. అనేక మంది కవులు, కవయిత్రులు తమ సాహితీ ప్రస్థానాన్ని 'నేటినిజం' స్వాగత తోరణం ద్వారానే ప్రారంభించిన వారున్నారు. ప్రసిద్ధులుగా తమ రచనల ద్వారా పాఠకుల హృదయాల్లో చోటు చేసుకున్న వారం సైతం చాలా మంది క్రమం తప్పకుండా పత్రికను ఆదరించి, ఆశీర్వదిస్తున్నారు.

కొత్తగా కలంపట్టే వారికి ప్రేరణనందించే విధంగా ప్రసిద్ధ కవులు, రచయితలు తమ రచనల ద్వారా 'నేటినిజం'లో ప్రేరణనందించడాన్ని చూస్తున్నాం. సాహిత్య సృజన చేస్తున్న కవులు, కవయిత్రులు, రచయితలు, రచయిత్రులను పరిచయం చేసేందుకు లోగడ 'నేటినిజం' ద్వారా విశేష కృషి జరిగిన విషయం మీకు తెలిసిందే.. ఇదే క్రమంలో కలం పట్టి సామాజిక చైతన్యానికి కృషి చేస్తున్న సృజనకారులు తమకు తామే స్వీయ పరిచయం చేసుకునేందుకు.. 'నేటినిజం' ముందుకు రాబోతున్నది. 'స్వీయ పరిచయ వేదిక' అన్న శీర్షికతో ప్రతివారం సాహితీ కెరటాల ద్వారా అందించాలని సంకల్పిస్తున్నాం..

*ఈ సందర్భంగా దిగువ సూచనలు గమనించి తమ పరిచయాన్ని తామే పంపించగలరని కోరుతున్నాం..*

**సూచనలు:**

**1)** ఇదివరకే తమ రచనల ద్వారా సాహితీ లోకానికి కవులుగా, రచయితలుగా, పరిచయమున్నప్పటికీ.. మీ, మీ మాటల్లోనే మీ గురించి రాసిన పరిచయ వాక్యాలను ఇంకా సమగ్రంగా సాహితీ బంధువులకు తెలియజేసే ఉద్దేశంతో ప్రారంభించబడుతున్న శీర్షిక ఇది. కనుక వాస్తవ విషయాలనే ప్రస్తావిస్తారన్న విశ్వాసముంది. వాస్తవాలనే పంపాలన్న సంగతి చెప్పాల్సిన అవసరం లేదు.

**2)** పేరు, వృత్తి, చిరునామా.. ఇత్యాది విషయాలను మొదట పేరాలో మీకు మీరే పరిచయం చేసుకోవాలి.

**3)** రచనా వ్యాసంగంలోకి కవిగా, రచయితగా ప్రవేశించిన సం॥... తమ తొలి రచన.. ఇత్యాది వివరాలు సంక్షిప్తంగా రాయాలి.

**4)** సాహితీ లోకంలో సృజనకారులుగా అడుగులు వేయడానికి మీకు ప్రేరణనిచ్చింది ఎవరు? వారికి సంబంధించి మీకు ఏ రచన ప్రభావితం చేసింది? వివరాలు సంక్షిప్తంగా రాయాలి.

**5)** ఇప్పటి వరకు రాసిన కవితలసంఖ్య, వ్యాసాల సంఖ్య, కథలు.. ఇతరత్రా ప్రక్రియల్లో మీరు ప్రదర్శిస్తున్న ప్రతిభకు సంబంధించిన వివరాలు-సంక్షిప్తంగా..

**6)** మీరు వెలువరించిన గ్రంథాలు.. ప్రక్రియలు.. ఏయే సంవత్సరాల్లో.. తదితర వివరాలు.. పుస్తకాల పేర్ల జాబితాను పొందుపరచాలి.

**7)** మీరు పొందిన సాహిత్య పురస్కారాలు.. లిస్ట్ పొందు పరువచ్చు. పొందుపరిచే క్రమంలో.. ముఖ్యమైన వాటినే ప్రస్తావించాలి.

**8)** మీరు పొందిన బిరుదులు-వివరాలు-అందించిన సంస్థలు-వాటి వివరాలు

**9)** మీరు రచించిన కవితల్లో/ కథల్లో/ రచనల్లో మీకు బాగా నచ్చింది ఏమిటి? వివరాలు సంక్షిప్తంగా పొందుపరచవచ్చు.

**10)** మీరు పాల్గొన్న సభల్లో మీకు బాగా నచ్చిన సభ.. వివరాలు అందించండి.

**11)** ప్రసిద్ధ కవులు-రచయితలతో సభను పంచుకున్న సభలనూ వివరించవచ్చు.

**12)** మీ ద్వారా సాహితీకారులకు పురస్కారాలు అందిస్తే వివరాలు తెల్పండి.

**13)** మీరు ఏదైనా పత్రికకు కాలమిస్టుగా వ్యవహరిస్తే.. వివరాలు రాయాలి.

**14)** మీరు వెలువరించిన గ్రంథాలకు సంబంధించిన గ్రంథాల టైటిల్ పేజీలను మీకు ఇష్టమైన వాటిని **ఐదు**కు మించకుండా పంపాలి.

**15)** మీ సాహిత్య ప్రస్థానంలో మీరు పాల్గొన్న సభలకు సంబందించిన ఫోటోలు ఉంటాయి. వాటిలో కూడా అతి ముఖ్యమైన వాటిని ఎంపిక చేసుకుని **ఐదింటి**ని మాత్రమే పంపాలి.

**16)** మీ రచనలపై ఏ విశ్వ విద్యాలయంలోనైనా పాఠ్యాంశాలుగా నిర్ణయింపబడితే వాటి వివరాలు ఇవ్వండి.

**17)** మీ రచనలపై ఏ విశ్వవిద్యాలయంలోనైనా పరిశోధనలు జరుగుతున్నట్లయితే వివరాలు.. అందించండి..

**18)** సాహిత్య సంస్థల నిర్వహణలో మీకున్న భాగస్వామ్యం వివరాలు-

**19)** ఇప్పుడొస్తున్న కవిత్వం/ కథలు/ ఇతర సాహిత్యంపై మీ అభిప్రాయం.

**20)** మంచి కవిత్వానికి/ కథకు/ రచనకు ఉండాల్సిన లక్షణాలు.. ఎలా ఉండాలని కోరుకుంటున్నారు?

**21)** ఇప్పుడొస్తున్న అంతర్జాల కవిత్వ సమూహాలు.. కవిత్వ సృజన జరుగుతున్న తీరు తెన్నులపై మీ అభిప్రాయం.

**22)** ఆధునిక సమాజంలో ఏ విధమగు సాహిత్యం/ కవిత్వం/ కథలు రావాలని కోరుకుంటున్నారు?

**23)** మీ లేటెస్ట్ పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటో పంపాలి.

**24)** కనీసం ఒక పుస్తకం ప్రచురణ అయిన వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

*పై అంశాల్లో మీకు సంబంధించిన వివరాలు ఉంటేనే మీ పరిచయ వ్యాసంలో పొందుపరచాలి. సంబంధం లేని అంశాలను వదిలేయాలి.. 'ఏమీ లేవు' అని పేర్కొనవలసిన అవసరం లేదు.*

*వివాదాస్పదమైన విషయాలను రచనలను అసలే ప్రస్తావించకూడదన్న విషయం మీకు తెలియందికాదు.*

*స్వీయ పరిచయానికి సంబంధించి మీరు ఇంకేమైనా ప్రస్తావించ దలుచుకుంటే ప్రస్తావించవచ్చు.*

*మీ పరిచయం వ్యాసం మూడు అరఠావులకు మించకూడదు.*

*బాగా ఆలోచించాకే విశేషాల వివరాలు పొందుపరచాలి. మళ్లీ మార్పులు-చేర్పులు చేయడానికి వీలుండదు.*

*'నేటినిజం'లో మీ పరిచయాన్ని ముద్రించే విషయంలో తుది నిర్ణయం సంపాదకులదే..*

*ఏ విధమైన ఉత్తర ప్రత్యుత్తరాలకు.. ఫోన్ సంప్రదింపులకు అవకాశం లేదు.*

*వీలు వెంబడి క్రమంగా ఒక్కోవారం ఒక్కో సృజనకారుని పరిచయం ప్రచురించడం జరుగుతుంది. మీ వంతు వచ్చేవరకు వేచి ఉంటారన్న విశ్వాసముంది.*

***ఇంకా ఆలస్యం దేనికి?***

పై సూచనలు పాటిస్తూ మీ పరిచయ వ్యాసం రాసి పంపండి..

**E-mail : netinizam2020@gmail.com**

- బైస దేవదాసు
సంపాదకులు: 'నేటినిజం' దినపత్రిక
ఎస్ఆర్‌టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-20. సెల్:9000065433

# ఏపీ భవన్ పీఆర్సీగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్ ప్రకాశ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:: కేంద్ర ప్రభుత్వం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులు, ఇతర పెండింగ్ అంశాల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ (పీఆర్సీ) ప్రవీణ్ ప్రకాశ్ అన్నారు.

శనివారం ఉదయం పీఆర్సీగా బాధ్యతలు చేపట్టిన ఆయన తనకున్న అనుభవంతో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. పీఆర్సీగా బాధ్యతలు చేపట్టే ముందు భవన్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామికి, దుర్గాదేవి అమ్మవారికి పూజలు నిర్వహించారు.

అనంతరం గురజాడ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మధ్య మరణించిన మాజీ పీఆర్సీసీ అభయ్ త్రిపాఠికి నివాళులు అర్పిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పీఆర్సీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రవీణ్ ప్రకాశ్, మళ్లీ ఢిల్లీ రావడం సంతోషంగా ఉందన్నారు.




Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com